Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 9 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 ఫిబ్రవరి 2024 శుక్రవారం పేజీలు : 4

## కాలినడకన అయోధ్యకు 350 మంది ముస్లింలు

అయోధ్య: అయోధ్య ఆలయంలో బాల రాముడు విశేష పూజలు అందుకుంటున్నారు. రాములోరిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వస్తున్నారు. ఇతర మతాలకు చెందినవారు అయోధ్య చేరుకుంటున్నారు. వారిలో కొందరు ముస్లింలు ఉన్నారు. 350 మంది ముస్లింలు అయోధ్య రాములోరి దర్శనం కోసం వచ్చారు. రాష్ట్రీయ్ స్వయం సేవక్ మద్దతు గల ముస్లిం రాష్ట్రీయ మంచ్ నేతృత్వంలోని బృందం బయల్దేరింది. ముస్లిల బృందం లక్నో నుంచి కాలినడకన అయోధ్య చేరుకుంది. చలిలో 150 కిలోమీటర్లు కాలి నడకన వచ్చి తమ భక్తిని చాటుకుంది.




# అద్భుతమైన ప్రగతి దిశగా...!

## రానున్న ఐదేళ్ళలో సుస్థిర అభివృద్ధి సాధిస్తాం!!

### బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ: వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ఆర్థిక విధానాలు ఉండబోతున్నాయని తెలిపారు. భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైన 'డెమొక్రసీ, డెమొగ్రఫీ, డైవర్సిటీ' త్రయానికి దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే సత్తా ఉందన్నారు. గురువారం లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్ 2024ను ప్రవేశపెడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

**80 కోట్ల మందికి ఉచిత రేషన్..** "గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయి. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తున్నాయి. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నాం. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ధి పొందారు. రైతులకు కనీస మద్దతు ధరను ఎప్పటికప్పుడు పెంచుతున్నాం. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

**అభివృద్ధి చెందిన భారతే లక్ష్యం..** 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేది. కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించింది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం.

**భారీ ఎత్తున రుణసాయం..** పీఎం స్వానిధి ద్వారా 78 లక్షల వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేశాం. మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇవ్వనున్నాం.

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జన్ ధన్ ఖాతాలకు రూ.34 లక్షల కోట్లు బదిలీ చేశాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.2.7లక్షల కోట్లు ఆదా అయ్యింది. స్కిల్ ఇండియా మిషన్ కింద 1.4 కోట్ల యువకులకు నైపుణ్య శిక్షణ అందించాం. పీఎం ముద్ర యోజన కింద రూ.22.5 లక్షల కోట్లు విలువ చేసే 43 కోట్ల రుణాలను మంజూరు చేశాం.

**ఏటా 11.8 కోట్ల రైతన్నలకు పీఎం కిసాన్..** పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా ఏటా 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సాయం అందిస్తున్నాం. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోంది. జాతీయ విద్యా విధానం ద్వారా అనేక మార్పులు తీసుకొచ్చాం.

3000 ఐటీఐలు, ఏడు ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 15 ఎయిమ్స్‌లు, 390 విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశాం. గత పదేళ్లలో ఉన్నత విద్యలో మహిళల నమోదు 28 శాతం పెరిగింది.

**రాష్ట్రాలకు సహకారం అందిస్తాం..** భారత ఆర్థిక వ్యవస్థను సంఘటితపర్చడానికి డిజిటల్ ఇండియా చాలా కీలకం. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడింది. మూలధన పెట్టుబడులకు 'గిఫ్ట్' ఒక ప్రధాన మార్గంగా అవతరించింది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. సామరస్యంతో కూడిన ప్రకృతి, ఆధునిక మౌలిక సదుపాయాలే వికసిత్ భారత్ విజన్. ఆశావహ జిల్లాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సాయం అందిస్తుంది. భారత వృద్ధి పథంలో తూర్పు భాగంలోని రాష్ట్రాలు కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తాం" అని సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.



## టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కీలక మలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి1: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. 2018లో నమోదైన డ్రగ్స్ కేసులకు సంబంధించి నాంపల్లి కోర్టులో ఎక్సైజ్ శాఖకు ఎదురుదెబ్బ తగిలింది. టాలీవుడ్ నటులపై నమోదయిన 8 కేసుల్లో 6 కేసులను కోర్టు కొట్టివేసింది. టాలీవుడ్ డ్రగ్స్ కేసుపై గత ప్రభుత్వం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసింది. టాలీవుడ్ డ్రగ్స్‌పై మొత్తం 8 కేసులను సిట్ నమోదు చేసింది. అయితే 8 కేసుల్లో ఆరు కేసులను కోర్టు కొట్టివేసింది. సరైన ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో ఈ కేసులను నాంపల్లి కోర్టు తోసిపుచ్చింది. డ్రగ్స్ కేసులో పాటించాల్సిన ప్రొసీజర్ ఫాలో కాకపోవటంతో ఎక్సైజ్ శాఖకు ఎదురు దెబ్బ తగిలింది. ఆరు కేసుల్లో ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేవని కోర్టు కొట్టివేసింది. ఈ కేసులకు సంబంధించి నెలల తరబడి టాలీవుడ్ నటులను ఎక్సైజ్ శాఖ విచారించిన విషయం తెలిసిందే. నటీనటుల దగ్గర నుంచి గోళ్లు, వెంట్రుకలు శాంపిళ్లను ఎక్సైజ్ శాఖ తీసుకుని.. ఆ శాంపిల్స్‌ను ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపించింది. అయితే డైరెక్టర్ పూరీ జగన్నాథ్, నటుడు తరుణ్‌ల శాంపిల్స్‌ను మాత్రమే ఎఫ్‌ఎస్‌ఎల్ పరిశీలించింది. పూరీ, తరుణ్‌ల శరీరంలో డ్రగ్స్ ఆనవాళ్లు లభించలేదని ఎఫ్‌ఎస్‌ఎల్ తేల్చిచెప్పింది. దీంతో ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక, సాక్ష్యాలను చూసిన నాంపల్లి కోర్టు కేసులను కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది.




వారణాసి: జ్ఞానవాపి ప్రార్థనా మందిరంలో భూగర్భ గృహంలోని హిందూ దేవతల విగ్రహాలకు బుధవారం రాత్రి పూజలు చేశారు. దీని కోసం ఓ పూజారి కుటుంబానికి వారణాసి జిల్లా కోర్టు బుధవారం అనుమతి మంజూరు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలు వెలువడిన గంటల వ్యవధిలోనే సీలు వేసి ఉన్న భూగర్భ గృహం మార్గాన్ని తెరిచే ఏర్పాట్లు చేశారు.

భారీ భద్రత నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రీం కోర్టు న్యాయవాది విష్ణు శంకర్ జైన్‌తో పాటు కాశీ విశ్వనాథ్ ట్రస్టు ప్రతినిధులు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. "కోర్టు ఆదేశాలను పాటిస్తూనే పూజలు చేశారు. కాశీ విశ్వనాథ ట్రస్టు పూజారి 'శయన హారతి' నిర్వహించి విగ్రహాల ముందు అఖండ జ్యోతి వెలిగించారు. రోజుకు నాలుగు సార్లు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు" అని జైన్ ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. పూజల కోసం దాదాపు 31 ఏళ్ల తర్వాత ఈ గృహం తెరుచుకున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే వెల్లడించారు. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జ్ఞానవాపి కాంప్లెక్స్ చుట్టూ సిబ్బందిని మోహరించారు.

**'హైకోర్టుకు వెళ్లండి' :** పూజలు చేసుకునేందుకు వారణాసి జిల్లా కోర్టు అనుమతి మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ జ్ఞానవాపి మసీదు కమిటీ గురువారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

అత్యవసర విచారణ చేపట్టాలని అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ తరఫు న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానం రిజిస్ట్రార్‌ను కోరారు.

అయితే ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచించినట్లు రిజిస్ట్రార్ వారికి తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయిలో మూసీ రివర్ ప్రాజెక్టు నిర్మాణం

హైదరాబాద్: మూసీ రివర్ ప్రాజెక్టును అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నట్లు.. ఇందుకోసం కావాల్సిన ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. న్యూ డెవలప్మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ జె. పాండియన్ గురువారం నాడు డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టును ఆధునిక హంగులతో తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టినట్లు తెలిపారు.



మూసినది అభివృద్ధిలో పర్యావరణాన్ని కాపాడుతూ, కాలుష్య రహితంగా, సహజ వనరులకు విఘాతం కలగకుండా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండో దశలో చేపట్టడానికి కావాలిసిన శిక్షణ, సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు శిక్షణ సంస్థలు సహకరించాలని సూచించారు. హాస్పిటల్స్, విద్యాసంస్థల హాస్టల్ బిల్డింగ్‌ల నిర్మాణానికి, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే గృహ నిర్మాణాలకు, వేస్టేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అనంతరం పాండియన్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురోభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు.




# సద్దుమణిగినట్లేనా...!?

## కృష్ణా బోర్డుకే ప్రాజెక్టుల నిర్వాహణ

### ఒప్పుకున్న తెలుగు రాష్ట్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 1: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వాహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. గురువారం ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగింతపై జలసౌధలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన సమావేశానికి కొనసాగింపుగా ఈ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు అంగీకరించాయి. అలాగే నీటి వాటాల పంపకం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దీంతో వాటాల కేటాయింపుపై త్రిసభ్య కమిటీనే తుది నిర్ణయం తీసుకోనుంది.

**మాకు అభ్యంతరం లేదు: ఏపీ ఈఎన్‌సీ –** బోర్డు పరిధిలో మొత్తం 15 ఓటిస్‌లలో 9 తెలంగాణ, 6 ఆంధ్రప్రదేశ్‌వి ఉన్నాయని ఏపీ ఈఎన్‌సీ నారాయణ రెడ్డి తెలిపారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆపరేషనల్ కోసం ఇరు రాష్ట్రాల నుంచి స్టాఫ్ కేటాయింపు ఉంటుందని.. వాటర్ కేటాయింపులపై త్రిసభ్య కమిటీ దే తుది నిర్ణయమని తెలిపారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్ త్రిసభ్య కమిటీ అప్పుడున్న పరిస్థితుల్లో తీసుకుంటారన్నారు. లెఫ్ట్ మెన్ కెనాల్ నుంచి 2 టీఎంసీ, మార్చ్‌లో రైట్ మెన్ కెనాల్ నుంచి 3 టీఎంసీ ఏపీకి విడుదలకు ఒప్పుకున్నారన్నారు. ఏప్రిల్‌లో 5 టీఎంసీలు ఏపీకి ముందుగానే ఉన్నాయన్నారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ కోసం తెలంగాణ ఒప్పుకుందని తెలిపారు.

**పూర్తిగా అప్పగించలేదు.. కేవలం: తెలంగాణ ఈఎన్‌సీ –** ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కేఆర్ఎంబీకి ఇవ్వడం జరిగిందని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ అన్నారు. పవర్ స్టేషన్స్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

నాగార్జున సాగర్ తెలంగాణ, శ్రీశైలం ఏపీ చూసుకుంటుందని చెప్పారు. ప్రాజెక్టులన్నీ ఇక నుంచి బోర్డు పరిధిలో నడుస్తాయన్నారు. తమ డిమాండ్స్ అన్నీ కేంద్రానికి లేఖలు రాసామని.. ఇంకా అక్కడ నుంచి నిర్ణయం రాలేదన్నారు. నీటి వాటాల పంపకంపై త్రిసభ్య కమిటీనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రాజెక్టుల వద్ద భద్రత అనేది పరిస్థితిని భట్టి బోర్డు కనుసన్నల్లో జరుగుతుందని చెప్పుకొచ్చారు. కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న 15 ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వెళ్తాయన్నారు. ప్రాజెక్టులను పూర్తిగా అప్పగించలేదని... ఆపరేషనల్, నీటి విడుదల బోర్డు చూసుకుంటుందని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ కూడా కృష్ణా బోర్డు పరిధిలోనే ఉంటాయన్నారు. నిర్వహణ కోసం స్టాఫ్ కేటాయింపు 40 : 45 కావాలని అడుగుతున్నారని వెల్లడించారు.

# సంపాదకీయం

## మాల్దీవులకు వెళ్లటానికి భారతీయులు ఇష్టపడం లేదు! ఎందుకని...!?

అవసరం లేకుండానే అక్కసు వెళ్లగక్కటం.. ఇరుగు దేశం మీద నోటికి వచ్చినట్లుగా మాటలు తూలటం లాంటి పనులు చేసిన మల్దీవులకు తగిన శాస్తి తగిలింది. లౌకికవాదుల పేరుతో నోటి కి వచ్చినట్లు మాట్లాడే వారిని మినహా యిస్తే.. మాల్దీవుల విషయంలో సామా న్యుల తీరు ఒకలా.. అపర లౌకిక వాదుల వాదన మరోలా ఉండటం తెలిసిందే. ఇదిలా ఉంటే.. భారత్ తో దౌత్యవివాదానికి తెర తీసిన ఆ దేశానికి తగిన శాస్తి జరిగినట్లుగా చెప్పాలి. నిత్యం భారత్ నుంచి మాల్దీవులకు వెళ్లే వారు.. ఇప్పుడా దేశానికి వెళ్లటానికి పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దీంతో మాల్దీవులను సందర్శించే భారతీయుల ర్యాంకు భారీగా పడిపోవటమే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ ఏడాది ఆరంభంలో సాహసాలు చేసే వారు దేశంలోని లక్షద్వీప్ కు రావాలంటూ ప్రధాని మోడీ పిలుపునివ్వటం.. దీనిపై మాల్దీవుల మంత్రులు ముగ్గురు విషం కక్కుతూ.. భారత్ ను చులకన చేసేలా.. తమ మనసులోని విషాన్ని వెళ్లగక్కటం.. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావటం తెలిసిందే. ఈ క్రమంలో బాయ్ కాట్ మాల్దీవ్ అన్న ఉద్యమం పెద్ద ఎత్తున సాగింది. ఇందుకు తగ్గట్లే పలువురు తమ మాల్దీవుల టూర్లను రద్దు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆ దేశాన్ని పర్యటించే భారతీయుల సంఖ్య భారీగా తగ్గింది. ఇందుకు తాజాగా వెల్లడైన గణాంకాలే నిదర్శనం. గత ఏడాది డిసెంబరు 31 వరకు భారత్ నుంచి 2.09 లక్షలకు పైనే పర్యాటకలు మాల్దీవుల్ని సందర్శించారు. ఆ దేశ పర్యాటకంలో 11 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. రష్యా రెండో స్థానంలో.. చైనా మూడోస్థానం లో ఉండేది. తాజా పరిణామాల నేప థ్యంలో ఈ ఏడాది మొదటి మూడు వారాల లెక్కనే తీసుకుంటే.. భారత్ నుంచి 13,989 మంది మాత్రమే సంద ర్శించారు. ఆ దేశాన్ని సందర్శించిన విదేశీయుల్లో భారతీయులు ఐదో స్థానంలో నిలవగా.. రష్యన్లు మొదటి స్థానంలో నిలిచారు. రెండోస్థానంలో ఇ టలీ నిలవగా.. మూడోస్థానంలో చైనా.. నాలుగో స్థానంలో బ్రిటన్ నిలిచింది. మొత్తంగా విదేశీ పర్యాటకుల ద్వారా భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని పొందే ఆ దేశం భారతీయ టూరిస్టులను కోల్పో వటం ద్వారా గట్టి షాకే తగిలిందన్న మాట వినిపిస్తోంది.

## విధుల్లోని ఒత్తిడి నుండి బయట బయటపడటంతో పాటుగా శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయి...

**ఘనంగా ప్రారంభమైన సైబరాబాద్ ఆరవ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2024**

**-ప్రారంభించిన సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్.**









సైబరాబాద్ క్రైమ్ న్యూస్ (గరుడ వార్త) : సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో గురువారం సైబరాబాద్ 6%th% యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2024ను సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్., మరియు జోనల్ డీసీపీలు కలిసి బెలూన్లు, పావురాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ముందుగా సీపీ వివిధ జోన్ ల నుంచి వచ్చిన పోలీస్ క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించా రు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... ముందుగా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో పాల్గొంటున్న సిబ్బందిని అభినందించారు.

పోలీసు సిబ్బంది అందరూ తప్పకుండా స్పోర్ట్స్ ఈవెంట్స్ లో పాల్గొనాలని కోరారు. సీనియర్ ఆఫీసర్లు కూడా ఏదైన ఒక ఈవెంట్ లో పాల్గొని స్పోర్ట్స్ మీట్ ను విజయవంతం చేయాలని కోరారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. పోలీసులు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నా రు.

క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నా రు. పోలీసు సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ వారి ఆరోగ్యం, మానసికోల్లాసం కోసం ప్రతీ సంవత్సరం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ను నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ పోలీసు సిబ్బంది ఎన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులు అందుకున్నారన్నారు. 3 రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ను తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి వారి టీమ్ లను ఉత్సాహపరచాలన్నారు. సైబరాబాద్ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్ మాట్లాడుతూ... ఫిబ్రవరి మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో వివిధ జోన్ల మరియు వింగ్స్ చెందిన పోలీసు క్రీడాకారులు ఉత్సాహంతో పాల్గొంటున్నారన్నారు.

పోలీసులు క్రీడల్లో పాల్గొనాలని కోరారు. నిత్య జీవితంలో నూ వ్యాయామాన్ని భాగం చేసుకోవాలన్నారు. 1000 మందికి పైగా పోలీస్ సిబ్బంది ఈ ఈవెంట్స్ లో పాల్గొనను న్నారు ఇందులో 150 మందికి పైగా విమెన్ స్టాఫ్ పాల్గొంటున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ గారితో పాటు సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఐపీఎస్., మాదాపూర్ డీసీపీ డాక్టర్ జి.వినీత్, ఐపీఎస్., శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి, ఐపీఎస్., రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఐపీఎస్., మేడ్చల్ డీసీపీ నితికా పంత్, ఐపీఎస్., డీసీపీ అడ్మిన్ రవి చందన్ రెడ్డి, ఎలెక్షన్ సె ల్ డీసీపీ అశోక్, సైబర్ క్రైమ్స్ డీసీపీ కె. శిల్పవల్లి, ఎస్ఓటిర డీసీపీ రషీద్, విమన్ & చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజనా కర్ణం, రాజేంద్రనగర్ ఏడీ సీపీ రష్మి పెరుమాళ్, ఐపీఎస్., సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ ష మీర్, సిఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాస్ రావు, ఏడీసీపీ క్రైమ్స్ జి.నరసింహా రెడ్డి, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, సెక్షన్ల సిబ్బంది, పోలీసు సిబ్బంది, మరియు మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

శామీర్ పేట, (గరుడ వార్త) : గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారు లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేయడంతో, జిల్లా పంచాయతీ అధికారి గ్రామపంచాయతీల వారిగా అధికారులను నియమించారు. శామీర్ పేట పంచాయతీ అధికారిగా జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ, అలియాబాద్ పంచాయతీ అధికారిగా శామీర్ పేట తహశీల్దార్ సత్యనారాయణ, బాబా గూడ పంచాయతీ అధికారిగా జిల్లా అడిట్ అధికారి వెంకటేశం, బొమ్మరాసి పేట పంచాయతీ అధికారిగా శామీర్ పేట ఎంపీడీవో వాణి, పొన్నాల పంచాయతీ అధికారిగా శామీర్ పేట వ్యవసాయ అధికారి రమేష్ ,లాల్ గడి మలక్ పేట పంచాయతీ అధికారిగా ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి, మజీద్ పూర్ పంచాయతీ అధికారిగా జిల్లా ఫిషరీష్ అధికారి పూర్ణిమ, తుర్కపల్లి పంచాయతీ అధికారిగా ఎస్ డి సి ఎల్ ఏ సైదులు, మురహరిపల్లి పంచాయతీ అధికారిగా శామీర్ పేట డిప్యూటీ తహసిల్దార్ ప్రసన్నలక్ష్మి, యాడారం పంచాయతీ అధికారిగా శామీర్ పేట ఎంపీ ఓ మంగతాయారు లను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. జనవరి 31 తో గ్రామపంచాయ తీలకు సర్పంచుల పదవీకాలం ముగిసినందున ఆస్థానంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. **మూడు చింతలపల్లి మండల ంలో...** ఆగ్రాస్ పల్లి, అనంతారంకు పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీవో సునీత, కొల్తూర్, జగన్ కూడా గ్రామాల ప్రత్యేక అధికారిగా మూడు చింతలపల్లి మండల తశీల్దార్ వాణి రెడ్డి, కేశవరం, కేశవాపూర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో వత్సల దేవి, లక్ష్మాపూర్ ప్రత్యేక అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీ, లింగాపూర్ తండాకు ప్రత్యేక అధికారిగా జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, మూడు చింతలపల్లి ప్రత్యేక అధికారిగా డిప్యూటీ తశీల్దార్ నాగజ్యోతి, నాగిశెట్టిపల్లి ప్రత్యేక అధికారి గా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కేశురాం, నారాయణపూర్ ప్రత్యేక అధికారిగా జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రాజేందర్, పోతారం ప్రత్యేక అధికారిగా కీసర వ్యవసాయాధికారి మాధవి, ఉద్దమర్రి ప్రత్యేక అధికారి గా మూడు చింతలపల్లి వ్యవసాయ అధికారి కృష్ణవేణీలను నియమించారు.

## 4న స్పోర్ట్స్ స్కూల్లో జిల్లా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

శామీర్ పేట, (గరుడ వార్త) : రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ఈనెల 4న అథ్లెటిక్స్ పోటీలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్టాన్లీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ లు తెలిపారు. శామీర్ పేట మండలం తూముకుంట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో ఆదివారము ఉదయం 8 గంటల నుంచి మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. జిల్లాస్థాయి సబ్ జూనియర్ అండర్ 8, 10, 12, 14 వయస్సు బాల బాలికలకు అథ్లెటిక్స్ లో భాగంగా రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి పలు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 10న కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని వారు వివరించారు.

## డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

శామీర్ పేట, (గరుడ వార్త) : గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. గురువారం శామీర్ పేటలోని గురుకుల డిగ్రీ కళాశాలలో కళాశాల వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థినులకు విజువల్ ఎయిడ్ ప్రొఫెషనల్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆప్తమోలజిస్ట్ జిల్లా వైద్యుడు కైసర్ మోహిద్దిన్, సీనియర్ ఆప్టోమెట్రీస్ట్ ఎండి సిరముద్దీన్





ల బృందం విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కంటి పరీక్షల్లో దాదాపుగా 60 మందికి కంటి అద్దాల అవసరం ఉన్నట్లు గుర్తించారు. వారికి కళ్ళజోడును అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చేతన, ఫిజికల్ డైరెక్టర్ అరుంధ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## దుకాణానికి రూ.1.25 లక్షలు!

హుజూరాబాద్ : హుజూరాబాద్ పురపాలికలోని పాలకవర్గ సభ్యుల్లో కొందరు వసూళ్లకు తెరలేపారు.. షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలకు యాజమాన్య హక్కు కల్పిస్తామని ఒక్కొక్కరి వద్ద రూ. 1.25 లక్షలు డిమాండ్ చేశారు.. నాలుగు రోజుల కిందట దుకాణదారులతో చర్చలు జరిపి తామడిగిన డబ్బులు ఇచ్చిన వారికే హక్కు పత్రం ఇస్తామని, లేదంటే ఇచ్చేది లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. హుజూరాబాద్ పురపాలిక కార్యాలయం పక్కన, సైదాపూర్ రోడ్‌లో పురపాలిక ఆధ్వర్యంలో మూడు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. మొత్తం 204 షాపింగ్ గదులను నిర్మించి 2016-17లో వ్యాపారులకు కేటాయించారు. నిర్మాణ సమయంలో ఒక్కో దుకాణానికి రూ. 1.50 లక్షలు చెల్లించారు. వీటిలో కొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా మరికొందరు వేరేవారికి అద్దెకు ఇచ్చారు. ఇంకొందరు ఇతరులకు అమ్ముకున్నట్లు తెలిసింది. కాగా దుకాణాలు పొందిన వారితో ఎలాంటి ఒప్పంద పత్రం లేకపోవడంతో ఆరేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించలేదు. దీంతో పురపాలిక రూ.లక్షల ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. రెండు నెలల క్రితం మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టి దుకాణదారుల వద్ద ఆస్తిపన్ను వసూలు చేసేలా తీర్మానించారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది కౌన్సిల్ సభ్యులు వసూళ్లపై దృష్టి పెట్టారు. నాలుగు రోజుల క్రితం సైదాపూర్ రోడ్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన దుకాణదారులతో చర్చలు జరిపారు. ఒక్కో దుకాణానికి రూ. 1.25 లక్షలు ఇస్తే యాజమాన్య హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. అయితే కాంప్లెక్స్ నిర్మాణ సమయంలోనే డబ్బులు చెల్లించామని, ఇపుడు మళ్లీ డబ్బు ఇవ్వడం తమవల్ల కాదని దుకాణదా రులు స్పష్టం చేసినట్లు తెలిసింది. తామడిగిన సొమ్ము ఇచ్చిన వారికే గదులపై హక్కు వస్తుందని, లేకుంటే ఇచ్చేది లేదని తేల్చిచెప్పడంతో దుకాణదారులు అయోమయంలో పడినట్లు సమాచారం. ఈ



వ్యవహారం ప్రస్తుతం చర్చల దశలోనే ఉండగా ఇప్పటివరకైతే ఎవరూ డబ్బులు ముట్టజెప్పనట్లు తెలిసింది. కాగా పురపాలిక నిబంధనల ప్రకారం యాజమాన్య హక్కు కల్పించడం సాధ్యం కాదని కొందరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె రాధికను వివరణ కోరగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారి వద్ద ఆస్తి పన్ను వసూలు చేసేలా నిర్ణయించామన్నారు. దుకాణాలు ఎవరికి కేటాయించారు.. ఎవరెవరు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నా రనే వివరాలు లేవన్నారు. ప్రస్తుతం దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇవ్వడంతోపాటు అద్దెకిచ్చిన గదులు, అమ్మిన గదులపై కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. డబ్బులకు డిమాండ్ విషయం తన దృష్టికి రాలేదన్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో మాట్లాడగా దుకాణాల విషయంలో ఎలాంటి హక్కు కల్పించడం అనే విషయం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

# ప్రభుత్వ వైద్యశాలల్లో సమస్యల తిష్ట

మంథని : అనారోగ్యంతో వచ్చే రోగులకు, గర్భిణులకు, వారి కుటుంబసభ్యులకు మంథనిలోని సామాజిక ప్రభుత్వ వైద్యశాల, మాతా శిశు కేంద్రాల్లో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఆస్పత్రులకు మంథని సహా ముత్తారం, రామగిరి, భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలాల ప్రజలు చికిత్సకు వస్తుంటారు. జనరల్ ఆస్పత్రిలో వైద్యులు, పడకల కొరతతో ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు. ఓపి గది శిథిలావస్థకు చేరడంతో హాల్‌లోనే రోగులను పరీక్షిస్తున్నారు. భవనంలో అనేక చోట్ల పెచ్చులు ఊడిపోతున్నాయి. కిటికీలు, వెంటిలేటర్లు దెబ్బతిన్నాయి. అత్యవసర సమయంలో ఉపయోగపడే జనరేటర్ తరచూ మొరాయిస్తుంది. పాత సీబీపీ, సుల్తానాబాద్ నుంచి తీసుకువచ్చిన ఎక్స్‌రే మిషన్లతోనే కాలం వెళ్ళదీస్తున్నారు. మాతా శిశు కేంద్రానికి ప్రహరీ, వైద్యులకు విశ్రాంత గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు కేంద్రాల్లో నిఘా నేత్రాలు నేలను చూస్తున్నాయి. తాగునీటి సౌకర్యం లేదు.

**వేధిస్తున్న వైద్యుల, పడకల కొరత**

సామాజిక వైద్యశాలలో 12 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, ఒక డెంటల్ సివిల్ అసిస్టెంట్, ఏడుగురు డిప్యూటీ సివిల్ సర్జన్స్, ముగ్గురు సివిల్ సర్జన్స్ ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు శాశ్వత, నలుగురు ఒప్పంద, ఇద్దరు డిప్యుటేషన్ వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. జనరల్ మెడిసిన్, ఫిజీషియన్, అనస్థీషియా, కంటి, చర్మ, ఎముకల, పిల్లల వైద్య నిపుణుల కొరత ఉంది. వైద్యులు, పడకల కొరత తదితర కారణాలతో గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాలకు రిఫర్ చేసి సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. దీంతో రోగులు, వారి



బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే ఖాళీగా ఉన్న వైద్యుల స్థానాలను భర్తీ చేసి.. 50 నుంచి 100 పడకలకు పెంచాలని స్థానికులు కోరుతున్నారు. 100 కేవీల విద్యుత్తు నియంత్రిక లేక వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ప్రారంభించలేదు. మార్చురీ గది దూరంగా ఉండటంతో మృతదేహాల పంచనామాలకు ఆలస్యమవుతుంది. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలోని ఎముకల వైద్య నిపుణుడు శ్రీనివాస్‌రెడ్డి ఈ ఆస్పత్రికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

తల్లులకు తప్పని తిప్పలు మాతా శిశు కేంద్రానికి ప్రహరీ లేక వరదలు వచ్చినప్పుడు పక్కనే ఉన్న డంపింగ్‌యార్డులోని చెత్త కొట్టుకు వస్తుంది. ఆవరణలో శునకాలు నిత్యం సంచరిస్తూ సిబ్బందిని, కేంద్రానికి వచ్చే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. విశ్రాంతి గదులు లేవని సిబ్బంది వాపోతున్నారు. మాతా శిశు వైద్యశాలలో ఒక డీజీవో, ఇద్దరు చిన్న పిల్లల వైద్య నిపుణుల అవసరం ఉంది. రెండు వైద్యశాలల్లో పనిచేస్తున్న 30 మంది శానిటేషన్ సిబ్బందికి ఏడాది కాలంగా జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# అదనులో తెరిస్తేనే ప్రయోజనం

జగిత్యాల : రాష్ట్రంలో మూతపడిన మల్లాపూర్, బోధన్, ముంబోజి పల్లెలోని మూడు చక్కెర కర్మాగారాలను తెరిపించేందుకు గల సాధ్యాసాధ్యాల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. కమిటీ సిఫారసులకు అనుగుణంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది. కమిటీ నివేదికను త్వరితంగా అందించి అదనులోనే కర్మాగారాన్ని తెరవాలని కర్షకులు కోరుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏకైక అతిపెద్ద వ్యవసాయాధారిత నిజాం షుగర్స్ కర్మాగారాన్ని తెరిపిస్తే రైతులకు అమిత ప్రయోజనం కలుగుతుంది. గతంలో చక్కెర కర్మాగారాలను తెరిపించేందుకు మనప్రాంత రైతులు, నాయకులను మహారాష్ట్రకు తీసుకెళ్లి అక్కడి కర్మాగారాలను చూపించారు. రైతుసంఘాలు లేదా ఎఫ్‌పీవోలు నడిపిస్తే అనుమతిస్తామని పేర్కొన్నా వెచ్చించాల్సింది పెద్దమొత్తం కావటంతో రైతులు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వమే పూర్తి నిధులను వెచ్చించి కర్మాగారాన్ని తెరిపించాలని, కేవలం సాగునుమాత్రం ఎఫ్‌పీవోలు లేదా రైతుసంఘాలకు పరిమితం చేయాలని అన్నదాతలు అభిలషిస్తున్నారు. ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలో గతంలో 15 వేల ఎకరాల్లో చెరకును రైతులు పండించేవారు. జగిత్యాలతో పాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల రైతులు కూడా మత్యంపేట కర్మాగారానికి చెరకును తీసుకొచ్చేవారు. పరిశ్రమ మూతతో ప్రస్తుతం చెరకుసాగు దాదాపు వెయ్యి ఎకరాలకు పరిమితం కాగా ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కంపెనీ పరిధిలో అందుబాటులోని ముత్యంపేట కర్మాగారం తెరిస్తే మరింత




లాభదాయకంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పరిశ్రమను తెరిస్తే క్రషింగ్ యంత్రాల సామర్థ్యం పెంచుతారు కాబట్టి దాదాపు చెరకుసాగు కనీసం 50 వేల ఎకరాలకు పెరగనుంది. ఇటీవల రుద్రూరు పరిశోధనస్థానం ద్వారా నూతన చెరకు వంగడాలు అందుబాటులోకి రాగా దిగుబడి పెరగటం, సాగుసమస్యలు తగ్గటంతో చెరకుసాగు తమకు లాభదాయకంగా ఉంటుందని, స్థిరమైన ఆదాయాన్ని ఇస్తుందని రైతులు చెబుతున్నారు.

వరిసాగులో ధాన్యం విక్రయ ఇబ్బందులు, ఇతర పంటలకు కోతులు, అడవిపందులు తదితర వన్యప్రాణుల బెడద తీవ్రమైన నేపథ్యంలో చెరకు ప్రత్యామ్నాయ మేలైన పంటగా భావిస్తున్నారు. గతంలో చెరకుసాగులో కూలీల కొరత ఉండగా ఇటీవల చెరకును నరికేందుకు హార్వెస్టర్లు అందుబాటులోకి రావటం కూడా రైతులకు కలిసిరానుంది. గతంలో ఎడ్లబండ్లద్వారా చెరకు గడల రవాణా చేపట్టగా ఇటీవల పూర్తిస్థాయిలో ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి.

ముత్యంపేట చక్కెర పరిశ్రమను తెరిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. చెరకును గానుగాడించిన తరువాత వెలువడే పిప్పిని తిరిగి పంటలకు వాడినపుడు మంచి సేంద్రియ ఎరువుగానూ ఉపయోగపడుతుంది. ఎన్నోప్రయోజనాలున్న చెరకు కర్మాగారాన్ని వీలున్నంత త్వరగా తెరవాలని రైతులు కోరుతున్నారు.

# ప్రారంభానికి నోచుకోక.. సమస్యలు తప్పక




ధర్మారం : కోనరావుపేట మండలం ధర్మారంలో 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.1.35 కోట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ (ట్రాన్స్‌కో) నిధులు మంజూరు చేసింది. నిర్మాణానికి అనువైన స్థలం లేదని ఏడాది కాలంగా పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు సర్పంచి అరుణ, పంచాయతీ పాలకవర్గం రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రధాన రోడ్డు పక్కన అనువైన స్థలం కేటాయించారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను గుత్తేదారు ఏడాదిన్నర క్రితం పూర్తి చేశాడు. అప్పటి నుంచి అది ప్రారంభానికి నోచుకోవటం లేదు. దీంతో వినియోగదారులకు, రైతులకు, చిన్న తరహా పరిశ్రమలు రైస్ మిల్లులు, కోళ్ల ఫాం యజమానులకు తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. యాసంగి సాగు ఆరంభంలోనే విద్యుత్తు సరఫరా ఇబ్బందిగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో ధర్మారం, మల్కపేట గ్రామాలకు విద్యుత్తు సరఫరా కాగా మర్తన్‌పేట, నిజామాబాద్ 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్లకు భారం తగ్గి లోఓల్టేజీ సమస్య పరిష్కారం కానుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

**వరి పొట్ట దశలోనే ఎండిపోయే ప్రమాదం**
**– గంగుల ప్రశాంత్, రైతు, ధర్మారం**

నాకు 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 8 ఎకరాలు బోరు, వ్యవసాయ బావి సాయంతో యాసంగిలో వరి సాగు చేస్తున్నా. విద్యుత్తు నియంత్రికల్లో లోఓల్టేజీతో తరచూ ఫ్యూజ్ వైర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. వేసవి ఆరంభంలోనే సమస్య ఇలా ఉంటే మార్చి, ఏప్రిల్ మాసంలో సమస్య తీవ్రంగా మారనుంది. దీంతో వరి పంట పొట్ట, కంకులు పాలు పోసే దశలో ఎండిపోయే ప్రమాదం ఉంది. అధికారులు, పాలకులు స్పందించి నూతన విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

**అధికారులకు విన్నవించినా స్పందన లేదు**
**– గున్నాల అరుణ, సర్పంచి ధర్మారం**

గ్రామ శివారులో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించగా నిర్మాణం పూర్తై ఏడాదిన్నర కావస్తోంది. గత యాసంగిలోనే రైతులకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కల్గుతోందని.. సబ్‌స్టేషన్ ప్రారంభించాలని అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి సబ్‌స్టేషన్ ప్రారంభించాలని కోరాం. సానుకూలంగా స్పందించి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ఆపరేటర్ల నియామకం చేపట్టాల్సి ఉంది**
**– ప్రదీప్ ఏడీ టీఎస్ఎన్పీడీసీఎల్**

సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. సెస్ అధికారులు 11 కేవీ విద్యుత్తు తీగల లైన్లు వేయాల్సి ఉంది. చిన్న చిన్న మరమ్మతులు కొనసాగుతున్నాయి. సబ్ స్టేషన్ ట్రయల్ రన్, ఛార్జింగ్ పరిశీలన పూర్తయ్యింది. సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహించటానికి ఆపరేటర్ల నియామకం చేపట్టాల్సి ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. త్వరలోనే ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది.

# రహదారుల నిర్మాణమెప్పుడో?



సిరిసిల్ల : జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. రెండేళ్లుగా రహదారుల మరమ్మతులకు సంబంధించి పనులు సరిగా సాగకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. వీటికితోడు గత జులైలో కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సుమారు వంద కిలోమీటర్ల మేర రహదారులు, పలుచోట్ల వంతెనలు, కల్వర్టులు శిథిలమయ్యాయి. వీటికి రూ.35 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. శాశ్వత మరమ్మతులతోపాటు వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఇంజినీరింగ్‌శాఖలతో సమీక్ష నిర్వహించింది. జిల్లా నుంచి పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.29.30 కోట్లతో కొత్త రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి సెప్టెంబరు నెలలో నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియలో ఉండగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం ఈ పనులన్నీ రద్దు చేశారు.

పనుల పరిస్థితి ఇలా..వేములవాడ డివిజన్‌లో వేములవాడ చెక్కపల్లి రహదారికి రూ.2.60 కోట్లు, కోనరావుపేట మండలం ఎక్లాస్‌పూర్, కోనరావుపేట మండల కేంద్రంలోని వంతెన నిర్మాణాలకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. దీనిలో ఎక్లాస్‌పూర్‌లో వంతెన పూర్తయినా ఇరువైపులా రహదారి అసంపూర్తిగా మిగిలింది. మండల కేంద్రంలో వంతెన నిర్మాణ దశలో ఉంది. మొత్తం నాలుగు రహదారులకు రూ.6.30 కోట్లు మంజూరు కాగా వాటిలో రూ.1.49 కోట్లతో చేపట్టిన ఇల్లంతకుంట మండలం ఆరేపల్లి, రేపాక రహదారి మాత్రమే పూర్తయింది. ఈ పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఎస్టీవోలో పెండింగ్‌లో ఉన్నాయి. సీఆర్ఆర్ కొత్త రహదారుల పనుల్లో భాగంగా గంభీరావుపేట మండలం కొత్తపల్లి నుంచి రాజుపేట రహదారి 3.50 కిలోమీటర్ల మేర పూర్తిగా శిథిలమైంది. దీనికి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీర్నపల్లి మండలం కేలోతుతండా, ఎల్లారెడ్డిపేటలో గిద్దెచెరువు–రాజన్నపేట, ముస్తాబాద్ మండలం నామాపూర్, తంగళ్లపల్లి మండలం మండేపల్లి, ఇందిరమ్మనగర్ రహదారి నిర్మాణం, గంభీరావుపేట మండలం గోరంటాల రత్నగిరిపల్లి, ముస్తాబాద్ మండలం గూడూరు పోత్గల్‌లో వంతెనల నిర్మాణం చేపట్టాలి. బోయినపల్లి మండలం కోరెం, నల్లగొండ రహదారి, చందుర్తి మండలం ఎల్గల్ నుంచి మామిడిపల్లి మొత్తం 34.40 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు రూ.24 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇవన్నీ టెండర్ల దశలోనే నిలిచిపోయాయి. గ్రామీణ రహదారుల మరమ్మతుల ఎంఆర్ఆర్, ఎఫ్‌డీఆర్‌లో 2021–22లో జిల్లా వ్యాప్తంగా 42 రహదారులకు రూ.39.78 కోట్లు మంజూరుకాగా అందులో తొమ్మిది రహదారులకు మాత్రమే పనులు జరిగాయి. మిగతా 31 రహదారుల మరమ్మతులు మధ్యలోనే నిలిచిపోయాయి. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలో ఇదే పరిస్థితి.

**ప్రణాళికలు చేస్తున్నాం– సూర్యప్రకాశ్, ఈఈ పంచాయతీరాజ్‌శాఖ**

రాకపోకలకు ఇబ్బందులు లేకుండా దెబ్బతిన్న రహదారులు, వంతెనలు కల్వర్టుల చోట తాత్కాలిక మరమ్మతులు చేశాం. గండ్లు పడి, బీటీ తేలినచోట శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. సెప్టెంబరు–అక్టోబరులోనే నిధులు మంజూరయ్యాయి. టెండర్ల దశలో ఉండగానే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రహదారులను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.

# కనిపించని పచ్చదనం

సారంగాపూర్ : ఏటా ప్రభుత్వ లక్ష్యం కంటే నాటే మొక్కల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ.. వాటిని సంరక్షించి చెట్లుగా పెంచడంలో అధికారులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవెన్యూ ప్లాంటేషన్ మినహా ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదు. జిల్లాలో ఒక్క డీఆర్డీఏ ద్వారానే ఎనిమిది విడతలుగా దాదాపు 21,308 ప్రాంతాల్లో 2,46,88,271(2.46కోట్లు) మొక్కలు నాటినట్లు లెక్కలు చూపారు. ఇందుకు గానూ ప్రభుత్వం ఒక్కో మొక్కపై ఏటా రూ.550 నుంచి రూ.600 చొప్పున వ్యయం చేస్తోంది. ఎనిమిది విడతలుగా జిల్లా వ్యాప్తంగా సగటున దాదాపు రూ.1357 కోట్లు వ్యయం చేశారు. వచ్చే ఏడాది(2024–25) నాటేందుకు 36.30 లక్షల మొక్కల లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లాలో 380 పంచాయతీలతోపాటు అనుబంధ గ్రామాలను కలుపుకొని 417 గ్రామాల్లో 421 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనాలు.. 57 ప్రాంతాల్లో కోతులకు ఆహార ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 90 ప్రాంతాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటుకు ప్రతిపాదించగా 65 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. గతేడాది హరితహారంలో 17.99 లక్షలు, దశాబ్ది సంపద వనాలను 10 ప్రాంతాల్లోని 12 ఎకరాలు గుర్తించి 4432 మొక్కలను నాటారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు భాగంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామానికి వెయ్యి మొక్కల చొప్పున జిల్లా వ్యాప్తంగా 3.80 లక్షల మొక్కలను నాటారు. 'మేరీ మిట్టి– మేరీ దేశ్'లో భాగంగా అమర జవాన్లు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు ప్రతి పంచాయతీలో 75 మొక్కలతో వనాలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా మొక్కలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అవెన్యూ ప్లాంటేషన్..హరితహారంలో రోడ్లకు ఇరువైపులా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ పర్వాలేదన్నట్లుగా ఉంది. అధికారులు, నాయకులు రహదారుల వెంట వెళ్తున్నప్పుడు మొక్కలు కనిపించకుంటే చర్యలు తీసుకుంటారనే భయంతో వీటి నిర్వహణపై దృష్టి సారిస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీరు కూడా అందించడంతో పచ్చదనం కనిపిస్తోంది. హరితహారం నిబంధనల ప్రకారం నాటిన మొక్క ఎండిపోయినా, విరిగిపోయినా దాని స్థానంలో మరొకటి నాటించాలి. క్షేత్ర స్థాయిలో కోట్లాది మొక్కల జాడ తెలియడంలేదు. కొన్ని గ్రామాల్లో మాత్రమే సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

# తాగునీటి పథకాలపై ఆశలు

మల్యాల : మల్యాల మండల కేంద్రం నుంచి తాటిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన దాదాపు 35 ఏళ్ల కిందట రూ.4 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత తాగునీటి పథకం(సీపీడబ్ల్యూఎస్) నిరుపయోగంగా మారడంతోపాటు పథకం పంప్‌హౌస్, ఫిల్టర్‌బెడ్స్ వద్ద దట్టంగా చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. మల్యాల, కొడిమ్యాల మండలాల్లోని దాదాపు 15 గ్రామాలకు రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు నిర్మించిన పథకం దాదాపు రెండున్నర దశాబ్దాలపాటు గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగు విభాగం ఆధ్వర్యంలో వినియోగంలో ఉండేది. మిషన్ భగీరథ పథకం ద్వారా మండలంలోని ఆయా గ్రామాలకు పైపులైను, ట్యాంకు నిర్మాణం చేపట్టడంతో సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని నిరుపయోగంగా వదిలేశారు. ఈ పథకానికి మండలంలోని కొంపల్లె చెరువు నుంచి తాటిపల్లి గురుకుల పాఠశాల సమీపంలోని ఫిల్టర్‌బెడ్స్‌లోకి నీటిని పంపింగ్ చేసి అక్కడ నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాత సంప్ నుంచి మల్యాల, కొడిమ్యాల మండలాలోని 15 గ్రామాలకు నీరు సరఫరా అయ్యేది. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం ద్వారా మండలంలోని సగం గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతోపాటు పాత పథకం కూడా మూలనపడటంతో



కోట్లాది నిధులు దుర్వినియోగమయ్యాయి. పంప్‌హౌస్‌ల్లోని భారీ మోటార్లు మాయమైనట్లు సమాచారం.

కొండగట్టు అంజన్న భక్తుల దాహార్తి తీర్చడంతోపాటు పుష్కరిణిలో నీళ్లు నింపడానికి దాదాపు 10 ఏళ్ల కిందట తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన స్థలంలో రూ.2.17 కోట్లతో రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. పథకం నిర్మాణంలో నాణ్యతలేని పైపులు వినియోగించడంతో ఆదిలోనే పథకం విఫలంకావడంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. ఈ పథకం ద్వారా దాదాపు రెండు నెలలు కూడా నీటి సరఫరా జరగకపోవడంతో పథకంలో అక్రమాలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలకు దారితీసింది. పథకానికి సంబంధించిన ఫిల్టర్‌బెడ్స్‌లో ఇసుక కూడా మాయం చేశారు. పాత పథకం నిర్వీర్యం కావడంతో ఆరు నెలల క్రితం ప్రభుత్వం కొండపైకి రూ.13.45 కోట్లతో వరద కాలువ నుంచి నీటి సరఫరా చేయడానికి మరో పథకానికి శ్రీకారం చుట్టింది. మండలాల్లో నిరుపయోగంగా మారిన పాత పథకాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొనడంతో ఈ రెండు నీటి పథకాల పునరుద్ధరణపై మండలవాసులకు మళ్లీ ఆశలు చిగురించాయి. నిరుపయోగంగా మారిన పథకాల ద్వారా భగీరథ నీటి సరఫరా కాని గ్రామాలకు నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# స్వాహాచెరలో సంక్షేమం..!

కరీంనగర్ : ఆయా విభాగాల్లో లక్షలాది రూపాయల సొమ్ము పక్కదారి పట్టగా.. తాజాగా బీసీ సంక్షేమ శాఖలో స్వాహా అయిన నిధుల వ్యవహారం ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఎప్పటికప్పుడూ పర్యవేక్షించకపోవడం.. ఆడిట్ తీరులోనూ డొల్లతనం బయటపడకపోవడం.. ఏళ్ల తరబడి చేతి వాటం వెలుగులోకి రాకపోవడంతో ఆ అధికారి ఆడిందే ఆటగా మారింది. పదవి విరమణకు ముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరించిన సదరు వార్డెన్ ఏకంగా రూ.31 లక్షలకుపైగా ప్రజాధనాన్ని తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించుకొని అక్రమానికి పాల్పడ్డాడు. ఈ అక్రమాల పాపం మూడేళ్ల కిందటి నుంచి జరుగుతున్నా.. గుర్తించకపోవడంతో సర్కారు ఖజానాకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

అంతా రహస్యమే..!మానకొండూర్ సమీకృత వసతి గృహం విద్యుత్తు బిల్లుల పేరిట రూ.31,25,283 పక్కదారి పట్టినట్లు జిల్లా అధికారులు ఆలస్యంగా గుర్తించారు. అక్కడ గతంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మీనారాయణ అనే విశ్రాంత అధికారి ఈ సొమ్మును స్వాహా చేశాడని విచారణాధికారులు తేల్చారు. దీంతో జిల్లా బీసీ సంక్షేమాధికారి అనిల్‌కుమార్ గతేడాది అక్టోబరు 3న మానకొండూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు సదరు విశ్రాంత ఉద్యోగి అక్రమానికి పాల్పడ్డాడని గుర్తించి ఈ నెల 19న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంత తతంగం జరుగుతున్నా.. గడిచిన కొన్ని నెలలుగా ఈ వ్యవహారాన్ని జిల్లాధికారులు ఇంటి గుట్టు బయటపడకుండా జాగ్రత్త పడ్డారు. ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతోనే ఈ అవినీతి బాగోతం



బయటపడింది. బిల్లులు అధికంగా..వసతిగృహం సంక్షేమానికి విడుదలైన బిల్లుల నుంచి ఈ మొత్తాన్ని కాజేసినట్లు విచారణాధికారులు గుర్తించారు. 2019 నుంచి 2021 సంవత్సర మధ్యకాలంలో ప్రతినెల విద్యుత్తు బిల్లులకు అదనంగా మరింత జోడించి జిల్లాధికారులకు లెక్కల్లో చూపించినట్లు తెలిసింది. వాస్తవానికి ఇక్కడి బిల్లు సగటున నెలకు రూ.60–70 వేలు వస్తే దానికి రెండు మూడింతలుగా వచ్చినట్లు చూపించి ఈ మొత్తాన్ని తన వ్యక్తిగత ఖాతాకు పంపించినట్లు విచారణాధికారి గుర్తించారు. ఇలా మొత్తంగా విద్యుత్తు శాఖకు రూ.7,40,191 రూపాయలను మాత్రమే చెల్లించినట్లు విచారణలో తేలింది. వాటికన్నా అధికంగా ప్రభుత్వ సొమ్ము రూ.38,65,474ను ఆయా సందర్భాల్లో వార్డెన్ ఖాతాకు చేరినట్లు గమనించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఖజానా శాఖతోపాటు బ్యాంకుల్లోనూ సేకరించి జిల్లా కలెక్టరుతో పాటు బీసీ సంక్షేమశాఖ కమిషనర్‌కు నివేదికను అందించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఫిర్యాదు చేయగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇదే విశ్రాంత అధికారి అక్కడి వసతి గృహంలో పనిచేసే మరో ఉద్యోగి పీఎఫ్ ఖాతాకు సంబధించిన రూ.9,25,000ను కూడా స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు.

**వసూలు చేస్తాం– అనిల్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమాధికారి**

పక్కదారి పట్టిన సొమ్మును రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం తిరిగి వసూలు చేస్తాం. ఇప్పటికే విచారణలో ఆయన చేసిన తప్పిదాలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. మున్ముందు చట్టపరంగా అవసరమైన చర్యల్ని తీసుకుంటాం. గతంలో జరిగిన తప్పిదాలపై తగిన దృష్టి పెడుతున్నాం. మొత్తంగా దుర్వినియోగమైన ప్రజాధనాన్ని తిరిగి రాబడుతాం. ఇక మీద కూడా శాఖాపరంగా ప్రత్యేకమైన పర్యవేక్షణను అన్ని రకాలుగా పెంచుతాం.

# గేటు పడితే.. వాహనం నిలవాల్సిందే..!

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రానికి మూడు వైపులా రైల్వే ట్రాక్‌లున్నాయి. రైల్వే గేటుపడితే చాలు వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. అర్జంటు పని ఉండి వెళ్లాలంటే వాహనం అక్కడ వదిలేయక తప్పడంలేదు. ఈ విషయంలో అధికారులు చొరవ చూపాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

25 ఏళ్లుగా కోరుతున్నా..జిల్లా కేంద్రంగా వికారాబాద్ పట్టణం మారకముందే మండల కేంద్రాల ప్రజలతో పాటు గ్రామాల నుంచి ప్రజలు, వాహనాలపై వచ్చే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. రైల్వే ట్రాక్‌లపై వంతెనల నిర్మాణం చేపట్టక పోవడంతో నిత్యం వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మూడు వైపులా ఉన్న రైల్వే ట్రాక్‌ల మీదుగా రైళ్ల రాకపోకలు విపరీతంగా ఉంటున్నాయి. అవి వచ్చిపోయే ప్రతిసారి గేటు పడటంతో వాహనదారులు 10 నుంచి 20 నిమిషాల పాటు ఇరు వైపులా ఆగిపోవాల్సిందే. జిల్లా కేంద్రంలో రోడ్డును చీల్చుతూ ఉన్న రైల్వే ట్రాక్‌ల సమస్యను పరిష్కారించాలని 25 సంవత్సరాల నుంచి పట్టణ ప్రజలు కోరుతున్నా పట్టించుకున్న నాథుడే లేకపోయారు.

**ఆ రోడ్డు ఒక్కటే దిక్కు**

వికారాబాద్ నుంచి తాండూరు వెళ్లే రోడ్డుపై రైల్వే ట్రాక్ ఉంది. ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. తాండూరు, ధారూర్, కోట్‌పల్లి, బంట్వారం, పెద్దేముల్ మండలాల నుంచి హైదరాబాద్ వెళ్లాలన్నా, తిరిగి రావాలన్నా ఈ రోడ్డు ఒక్కటే పెద్ద దిక్కు. దీనిపై ఉన్న రైల్వే ట్రాక్‌పై అధిక



సంఖ్యలో రైళ్లు తిరుగుతుంటాయి. దీంతో తరచుగా గేటు మూసివేస్తారు. ఇదొక్కటే కాకుండా రామయ్యగూడ, గంగారం గ్రామ సమీపంలో రైల్వే గేటులున్నాయి. రామయ్యగూడ సమీపంలో ఉన్న గేటు ఎక్కువ సార్లు మూసి ఉంటుంది. గంగారం రైల్వే గేటు మీది నుంచి వాహనాలు రాకపోకలు పెరిగాయి. జైదుపల్లి, తరిగోపుల, గొట్టిముక్కుల, నాగారం తదితర గ్రామాలున్నాయి. వీటికి చెందిన ప్రజలు వాహనాలపై వికారాబాద్‌కు వచ్చివెళుతుంటారు. గేట్ల మూసివేతతో సమయం వృథా అవుతోంది.సర్వేతో సరి: రామయ్యగూడ రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అధికారులు 2020లో సర్వే చేశారు. అదిగో అంటూ కాలం పొడిగించారే తప్ప పనుల గురించి ఎవరూ పట్టించుకోలేదు. రామయ్యగూడ ప్రజలు మాత్రం అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఆశించారు. ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవటం వల్ల తమ ఇక్కట్లు ఎప్పటికీ తీరతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామయ్యగూడ ఒక్కటే కాకుండా గంగారం వద్ద, అనంతగిరి రోడ్డు మార్గంలో ఉన్న రైల్వే గేట్ల వద్ద వంతెనలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# మార్కెట్ యార్డు నిర్మాణం జరిగేనా..!

వేములవాడ : మార్కెట్ యార్డు నిర్మాణం కోసం స్థలం కేటాయించారు. పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం నిధులు కేటాయించడంతో టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతుండటంతో మార్కెట్ యార్డు నిర్మాణ పనులకు ముందడుగు పడటం లేదు. వేములవాడలోని మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి రెండెకరాల స్థలాన్ని మార్కెట్ అధికారులు మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఇతర కట్టడాలు ఉండటంతో యార్డులో ధాన్యం కొనుగోళ్లు ఇతర కార్యకలాపాలకు స్థల కొరత ఏర్పడటంతో మరో చోట మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వేములవాడ గ్రామీణ మండలంలోని మర్రిపల్లిలో 13.20 ఎకరాల స్థలాన్ని మార్కెట్ యార్డు కోసం రెవెన్యూ అధికారులు కేటాయించి మార్కెట్ అధికారులకు అప్పగించారు. నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికి నేటికి పనులు ప్రారంభం కావడం లేదు.

**రూ.2.51 కోట్లు కేటాయింపు**

మర్రిపల్లిలో కేటాయించిన స్థలంలో పదకొండు పనులు చేపట్టేందుకు రూ.2.51 కోట్లను కేటాయించారు. ఇందులో యార్డు ముందు



భాగంలో ప్రహరీ గోడ నిర్మాణం, యార్డు చుట్టూ ఫెన్సింగ్ కోసం రూ.35 లక్షలు, కవర్ షెడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు, కార్యాలయ భవనానికి రూ.60 లక్షలు, పురుషులు, స్త్రీలకు శౌచాలయాలకు రూ.15 లక్షలు, బోరు, శుద్ధజల కేంద్రం(ఆర్వో ప్లాంట్)కు రూ.12 లక్షలు, ప్రధాన రహదారి నుంచి యార్డు లోపలికి ప్లాట్‌ఫాం నిర్మాణం కోసం రూ.16 లక్షలు, యార్డు స్థలం చదునుకు రూ.35 లక్షలు, హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు రూ.20 లక్షలు కేటాయించారు. మార్కెట్ యార్డు కోసం కేటాయించిన స్థలంలో గత ప్రభుత్వంలో నిధులు కేటాయింపు జరగడంతోపాటు టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభంపై గుత్తేదారులు ముందుకు రావడం లేదని తెలిసింది.త్వరగా పూర్తి చేస్తే ఉపయోగం– గంగాధర నర్సయ్య, రైతు మర్రిపల్లి మర్రిపల్లిలో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం స్థలం కేటాయించినప్పటికీ ఎలాంటి పనులు ప్రారంభించలేదు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టే సమయానికి ఇక్కడ యార్డులో కొనుగోళ్లు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తయితే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

**పనులు ప్రారంభం కావాల్సి ఉంది– సత్యనారాయణ, కార్యదర్శి వేములవాడ వ్యవసాయ మార్కెట్**

మర్రిపల్లిలో మార్కెట్ యార్డు నిర్మాణానికి 13.20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇందులో వివిధ పనులు చేపట్టడానికి రూ.2.51 కోట్లు కేటాయించడంతో టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

# బల్దియా సొమ్ముకు టెండరు




హైదరాబాద్: వాహనాల మరమ్మతులు, ఏళ్లుగా అవే అద్దె వాహనాల కొనసాగింపు, చెత్త తరలింపు వాహనాలకు సంబంధించిన డ్రైవర్లు, సిబ్బందికి జీతాలిచ్చే టెండర్లు.. ఇతరత్రా పనుల్లో అవకతవకలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో.. దాదాపు తొమ్మిదేళ్ల కిందట కుదిరిన ఒప్పందాలను అధికారులు ఎప్పటికప్పుడు పొడిగిస్తూనే ఉన్నారు. సిబ్బందికి జీతాలిచ్చే టెండర్లలోనూ కొన్ని ఏజెన్సీలకు మేలు చేసేలా గతంలో కుదిరిన ఒప్పందాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయి. వాటి కారణంగా.. చేయని పనులకు ప్రైవేటు సంస్థలు ప్రతి నెలా బిల్లులు తీసుకుంటున్నాయి. పనిచేయని వాహనాలకు అద్దెలు మంజూరవుతున్నాయి. మొత్తంగా.. బల్దియాపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోంది. ప్రభుత్వం ఆయా చెల్లింపులు, కాంట్రాక్టులపై విచారణ చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వాహనాల రూపంలో..జీహెచ్ఎంసీ సొంత నిధులతో 2016లో 37 రెఫ్యూజ్ కాంపాక్టర్ (ఆర్ఎఫ్‌సీ) వాహనాలను కొనుగోలు చేసింది. వాటికి అవసరమైన మరమ్మతులు చేయించేందుకు అదే సమయంలో ఓ ప్రైవేటు ఏజెన్సీని నియమించుకుంది. అందుకు ఏడాదికి రూ.1.55 కోట్ల వార్షిక రుసుము చెల్లించేలా ఒప్పందం జరిగింది. వాస్తవానికి వాహనాలకు అవసరమైన మరమ్మతులన్నీ బల్దియా పార్కింగ్ యార్డుల్లోనే జరుగుతున్నాయని, టైర్లు, ట్యూబులు, ఇంజిన్ ఆయిల్, డీజిల్, బ్యాటరీలన్నీ బల్దియా వ్యయంతో చేస్తున్నారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. కొందరు అధికారులు.. నకిలీ బిల్లులను సృష్టించి ఏజెన్సీకి చెల్లిస్తున్నట్లు, నిధులను దారి మళ్లిస్తున్నారని తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. సికింద్రాబాద్ జోన్‌లో రెండు అద్దె ఆర్ఎఫ్‌సీ వాహనాలు ఉండటం తెలిసిందే.

రోజువారీ ఇంటింటి చెత్త సేకరణలో పాల్గొనే స్వచ్ఛ ఆటోలు 20 శాతానికి పైగా విధులకు గైర్హాజరవుతున్నాయి. కొన్ని వాహనాలు నగరం దాటి వెళ్తున్నాయి. కిందిస్థాయిలో పనిచేసే కొందరు పర్యావరణ ఇంజినీర్లు, సహాయ వైద్యాధికారులు బినామీ పేర్లతో కొన్ని వాహనాలను నడిపిస్తున్నారని, ఆటోలను ఇచ్చేందుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి డబ్బు తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో చాలామంది ఇంటింటి చెత్త సేకరణకు దుమ్మా కొట్టి, వాహనాలతో ప్రైవేటు పనులు చేసుకుంటున్నారని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు.

350 మంది అధికారులకు జీహెచ్ఎంసీ అద్దె కార్లను కేటాయించింది. అందులో సగానికి పైగా అధికారులసొంత వాహనాలే. వాటికే ఏజెన్సీల పేరుతో ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.34 వేల అద్దె వెళ్తోంది. మరో 120మంది అధికారులు జీహెచ్ఎంసీ వాహనాలను ఉపయోగిస్తున్నారు. వాటికి మరమ్మతుల వ్యయంలోనూ అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి.

350 మంది అధికారులకు జీహెచ్ఎంసీ అద్దె కార్లను కేటాయించింది. అందులో సగానికి పైగా అధికారులసొంత వాహనాలే. వాటికే ఏజెన్సీల పేరుతో ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.34 వేల అద్దె వెళ్తోంది. మరో 120మంది అధికారులు జీహెచ్ఎంసీ వాహనాలను ఉపయోగిస్తున్నారు. వాటికి మరమ్మతుల వ్యయంలోనూ అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి.

మార్లిన్ ఇన్‌ఫ్రా లయన్ సర్వీసెస్ సంస్థకు చెందిన 18 చెత్త ఊడ్చే యంత్రాలను ఆగస్టు–2015లో మూడేళ్లకని అద్దెకు తీసుకున్నారు. ఒక్కో వాహనానికి రూ.1.25 కోట్ల వార్షిక అద్దె ఇవ్వాలనేది నిర్ణయం. తొమ్మిదేళ్లుగా అదే సంస్థ బండ్లు పని చేస్తుండటం గమనార్హం.

పారిశుద్ధ్యం విభాగంలో జేసీబీలు, ఐదు టన్నుల టిప్పర్లు, బాబ్‌కాట్‌లు, ఇతరత్రా వాహనాలను తాత్కాలిక కాల పరిమితికి అద్దెకు తీసుకునే టెండర్లలో అవకతవకలు జరుగుతున్నాయని, లేని వాహనాలకు కూడా కింది స్థాయి ఇంజినీర్లు బిల్లులు చెల్లిస్తున్నారనే విమర్శలున్నాయి.

# జలనిధి.. సమాధి



కూకట్‌పల్లి : మహానగరంలో అనేక చెరువులు అదృశ్యమవుతున్నాయి. మరికొన్ని కబ్జాకు గురవుతున్నాయి. కొందరు బఫర్‌జోన్‌లో వెంచర్లు వేసి రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సాగునీటి శాఖతోపాటు జీహెచ్ఎంసీలోని కొందరు కిందిస్థాయి అధికారులకు సంబంధాలున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకనాడు గొలుసుకట్టు చెరువులుగా పేరొందిన తటాకాలు.. ఎక్కడికక్కడ కబ్జాలకు గురై నాలాలతో అనుసంధానం తెగిపోవడంతో అనేక కాలనీలు చిన్నపాటి వర్షానికే ముంపు బారినపడుతున్నాయి. అధికారులు శాసనసభ ఎన్నికల క్రతువులో ఉండగా.. క్షేత్రస్థాయిలో గత రెండు నెలలుగా అనేక చెరువుల్లో ఆక్రమణలు జరిగిపోయాయని తాజా పరిశీలనలో తేలింది. చాలాచోట్ల పార్టీలకు అతీతంగా స్థానిక నేతలు ఏకమై కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే జలసిరులు మాయమయ్యే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇవీ కొన్ని ఉదాహరణలు..

ఓల్డ్‌బోయిన్‌పల్లి హస్మత్‌పేటలోని బోయిని చెరువు ఎఫ్‌టీఎల్‌లో 30 ఏళ్ల క్రితం 4 ఎకరాల్లో ఎస్‌సీ కాలనీ వెలవగా.. ఆరేడేళ్లుగా ఓ వ్యక్తి 4 ఎకరాల చెరువు భూమిని కాజేసి తన కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు. దీన్ని స్వాధీనం చేసుకోవడానికి నీటిపారుదల, రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ పోలీసుల నుంచి సహకారం అందడంలేదన్నది సమాచారం. మరో 2 ఎకరాల ఎఫ్‌టీఎల్ భూమి కూడా ఆక్రమణకు గురైంది. వెరసి 63 ఎకరాల ఈ చెరువు ప్రస్తుతం 53 ఎకరాలకు చేరింది.కూకట్‌పల్లి గ్రామంలోని నల్లచెరువులో పట్టాభూముల పేరుతో ఇక్కడ సుందరీకరణను అడ్డుకుంటూ వస్తున్న కొందరు వ్యక్తులు ఇప్పటికే షెడ్లు వేశారు. చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయంటూ వేలెత్తి చూపుతున్నవారే ఇక్కడ ఆక్రమణకు తెగపడుతుండడం గమనార్హం. ఇప్పటికే 30 గుంటల స్థలం కనుమరుగైంది. 3 ఎకరాల యూఎల్‌సీ భూమిలో ఎస్‌టీపీ నిర్మించేందుకు చేసిన ప్రయత్నాన్ని కూడా అదే వ్యక్తులు అడ్డుకోవడం గమనార్హం.

కూకట్‌పల్లి విజ్ఞాన్‌పురికాలనీ ఆనుకొని ఉన్న ఖాజాకుంటలో ఓ పార్టీకి చెందిన వ్యక్తి ప్రైవేటు సర్వే నంబర్లు వేసి ఏకంగా చెరువు శిఖంలోని భూమిని అమ్ముకున్నారు. ఇప్పటికే 17 గుంటల స్థలం ఆక్రమణకు గురైంది. ఇందులో రెండు అపార్ట్‌మెంట్లు కూడా వచ్చాయి. తాజాగా కొందరు చదును చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

అల్లాపూర్‌లోని సున్నం చెరువులో 8.89 ఎకరాలను పలు రాజకీయ పార్టీల నేతలు కబ్జా చేయగా.. ఇప్పటికీ కొందరు సమయం దొరికినప్పుడల్లా గదులు నిర్మించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. 24.12 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు ప్రస్తుతం 15.23 ఎకరాలే మిగిలింది.

మూసాపేటలోని మైసమ్మ చెరువులోని పట్టాభూమిని సాకుగా చూపి.. అలుగు వద్ద రూ.కోట్ల విలువైన స్థలాన్ని కాజేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పార్టీల వారు కలిసి 10.02 ఎకరాల చెరువు సలాన్ని దర్జాగా కబ్జాచేసి రూ.కోట్లు వెనకేసుకున్నారు. కూకట్‌పల్లి ఠాణాలో కేసులు నమోదైనప్పటికీ.. ఆక్రమణ పర్వం ఆగడంలేదు. ఫలితంగా 84.02 ఎకరాల్లో ఉండాల్సిన ఈ చెరువు.. ప్రస్తుతం 74 ఎకరాలకు కుంచించుకుపోయింది.

ఇటీవల మూసాపేటలోని కాముని చెరువులో స్థానిక నేతలు రాత్రికిరాత్రి 30 గుంటలకు పైగా పూడ్చి పంచుకున్నారు. దీనికి సంబంధించి ఆరుగురిపై కూకట్‌పల్లి ఠాణాలో కేసు నమోదైంది. అయినప్పటికీ కొందరు శిఖంలో దర్జాగా మట్టితో పూడ్చి ఆక్రమిస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 6 ఎకరాలు మాయమైంది.

కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు బఫర్‌జోన్‌లో ఇప్పటికే ఓ వ్యక్తి షెడ్లు వేయగా.. తాజాగా కొందరు చెరువును పూడ్చి రేకులు వేశారు. ఇప్పటికే 3 ఎకరాల చెరువు మాయం చేశారు. మరింత కాజేసేందుకు కాపు కాశారు. 38.18 ఎకరాల్లో ఉండాల్సిన ఈ చెరువు.. ప్రస్తుతం 35.18 ఎకరాలకు కుంచించుకుపోయింది.

# వీటికీ మోక్షం దక్కేనా?

హైదరాబాద్ : మెహిదీపట్నంలో రోడ్డు దాటేందుకు ప్రజలు ప్రాణాలరిచేతిలో పట్టుకొని వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రక్షణశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో అక్కడ హెచ్ఎండీఏ నిర్మించతలపెట్టిన స్కైవాక్ పనులు కొంతకాలంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు 0.53 ఎకరాల భూమి ఇచ్చేందుకు రక్షణశాఖ ముందుకు రావడంతో పనులు ప్రారంభించేందుకు హెచ్ఎండీఏ యంత్రాంగం సిద్ధమవుతోంది. అదేవిధంగా గ్రేటర్ వ్యాప్తంగా ఇదివరకు ప్రతిపాదించిన ప్రాజెక్టులకూ రక్షణ శాఖ నుంచి అనుమతుల కోసం హెచ్ఎండీఏ ఎదురు చూస్తుంది.ముంబయి జాతీయ రహదారి పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి. డబుల్ డెక్కర్ బస్సులు నడిచేలా ఈ కారిడార్ నిర్మించాలనేది ప్రణాళిక. అయితే ఇక్కడ రక్షణకు శాఖకు సంబంధించి 56.19 ఎకరాలున్నాయి.బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 1 పింఛను కార్యాలయం వద్ద రోడ్డు వెడల్పు పనులకు ప్రతిపాదనలు చేశారు. నిత్యం ఇక్కడ ట్రాఫిక్ జాంలతో వేలాది మంది వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ 221 చదరపు మీటర్ల స్థలం రక్షణ శాఖ పరిధిలో ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు.



సన్‌సిటీ నుంచి అత్తాపూర్ వరకు రోడ్డులో గతంతో పోల్చితే రద్దీ భారీగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో రహదారి విస్తరణకు ప్రణాళికలు రూపొందించారు. రక్షణ శాఖకు సంబంధించి 2.4 ఎకరాల భూమి అవసరం.కంచన్‌బాగ్ వద్ద రోడ్డు విస్తరణకు 1,029 చదరపు మీటర్ల స్థలం కావాలి.జూబ్లీ బస్టాండ్ నుంచి రాజీవ్ రహదారిలో డబుల్ డెక్కర్ బస్సుల కోసం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 98 ఎకరాలు సేకరించాలి. రక్షణ శాఖ స్థలాలను అప్పగిస్తే అంతకు విలువైన భూమిని వేరే చోట అప్పగించడం ద్వారా మార్కెట్ విలువ ప్రకారం రేటు కట్టి ఇవ్వడం షరతులు పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

# దళారుల దగా.. రైతన్న వ్యథ

తాండూరు: సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆరుతడి పంటలు సాగుచేసి అప్పులు తీర్చుకుందామని ఆశిస్తున్నా.. పరిస్థితులు అనుకూలించడంలేదు. దీంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారుల అవతారం ఎత్తిన వ్యాపారుల ఇష్టారీతి ధరల నిర్ణయంతో రైతులు బిక్కమొగం వేస్తున్నారు. ఆగ్రహంచి రోడ్డెక్కి ఆందోళనకు దిగాల్సి వస్తోంది. ఇందుకు ఉదాహరణగా తాజాగా పరిగిలో న్యాయం కోసం రోడ్డెక్కిన వేరుసెనగ రైతులనే పేర్కొనవచ్చు. కథనం.

**రబీలో ఆరుతడిదే పైచేయి**

జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజక వర్గాల పరిధిలో యాసంగిలో ప్రధాన ఆరుతడి పంటగా వేరుసెనగ ఎక్కువ ఎకరాల్లో వేశారు. సాధారణంగా రబీలో ఆరుతడి పంటలదే పైచేయి. ఎంతో కొంత లాభం వస్తుందని ఆశిస్తే దళారులు తాము విక్రయిస్తే ఎక్కువ ధర చెబుతున్నారు. కొనాలంటే తక్కువ ధర చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

పడిపోయిన దిగుబడులు: వాస్తవానికి ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేస్తే కనీసం 14నుంచి 16క్వింటాళ్ల దిగుబడులు రావాల్సి ఉంది. కానీ వాతావరణ పరిస్థితుల కారణంగా కేవలం 12క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చిందని రైతులు తెలిపారు. వేరుసెనగ విత్తనం కొనుగోలుకు రూ.15వేల వరకు వెచ్చిస్తే పండించిన పంటకు మాత్రం



ధర అందడం లేదన్నారు. క్వింటాకు మార్కెట్లో రూ.6,600కు విక్రయిస్తే రవాణా, కూలీలు, పెట్టుబడి తీసేస్తే తమకు ఏమీ గిట్టుబాటు కావడం లేదని ఆవేదన చెందుతున్నారు.

**ఎగుమతులు స్తంభించినందుకే..రాజేశ్వరి, వ్యవసాయ విపణి కార్యదర్శి,**

తాండూరువేరుసెనగ కాయల ఎగుమతి స్తంభించినందుకే విపణిలో విక్రయానికి వస్తున్న ఉత్పత్తులకు ధరలు తగ్గుతున్నాయి. శివరాత్రి సమయంలో మహారాష్ట్రలో వేరుసెనగ కాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అప్పుడు ఎగుమతులు పెరగుతాయి కాబట్టి ధరలు ఎక్కువగా లభ్యమయ్యే అవకాశం ఉంది. విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు రైతులు విక్రయానికి తీసుకు రాకుండా నిల్వ చేసుకుంటున్నారు. మరి కొందరు రైతులు విక్రయిస్తున్నారు. ధరల విషయంలో మావంతుగా రైతుకు న్యాయం జరిగేలా చూస్తున్నాం.

**ఖాళీ బస్తాలతో ఇంటికి వెళ్లాం – రాములు, ఇబ్రహీంపూర్**

వేరెసెనగ ఎకరాకు 5బస్తాల దిగుబడి తగ్గింది. మార్కెట్‌కు తీసుకువస్తే వ్యాపారులందరూ కుమ్మక్కయ్యారు. రూ.6,600 కొనుగోలు చేస్తామంటే చివరకు ఏమీ మిగలకుండా ఖాళీ బస్తాలతో ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది.కొనుగోలుదారులు ఎక్కువగా పాల్గొనేలా చూడాలి– తులసీరాం, రైతుమార్కెట్లో కొంతమందే కాకుండ ఎక్కువ సంఖ్యలో కొనుగోలుదారులు బీట్లలో పాల్గొనేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి. కొంతమందే పాల్గొనడంతో అందరూ మాట్లాడుకుని ధరలు తగ్గిస్తున్నారు.

# సాయంత్రం ఓపీ సేవలకు ఆదరణ కరవు

హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభించిన సాయంత్రం ఓపీ సేవలను రోగులు సక్రమంగా ఉపయోగించుకోవడం లేదు. ఉదయం మాత్రం రద్దీగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓపీ చీటీ నుంచి టెస్టుల వరకు ఆలస్యం అవుతుండటంతో కొన్నిసార్లు రోగులు రెండ్రోజులపాటు నిరీక్షించాల్సి వస్తోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న వైద్య ఆరోగ్యశాఖ సాయంత్రం ఓపీ సేవలు అందుబాటులోకి తెచ్చినా.. సరైన ఫలితం లభించడం లేదు.

రోగుల సౌకర్యార్థం.. సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉ.8– మ.12 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉండేవి. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న వైద్య ఆరోగ్యశాఖ సా.4– 6 గంటల వరకు ప్రత్యేక ఓపీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, నెఫ్రాలజీ, కార్డియాలజీ లాంటి సేవలు ప్రవేశపెట్టింది. గాంధీ, ఉస్మానియా, ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఉస్మానియా ఆస్పత్రిలో సాయంత్రం పూట రోజుకు కేవలం 10–15 రోగులు మాత్రమే వస్తున్నారు. దీంతో కొన్నిసార్లు తెరవడం లేదు. ఉదయం ఎక్కువ మంది వస్తుండటంతో ల్యాబ్‌ల వద్ద నిరీక్షణ



తప్పడం లేదు. ఎక్సరే, సిటీస్కాన్, 2డీఈకో, రక్త, మూత్ర పరీక్షల వద్ద రద్దీగా ఉంటుంది. య సాయంత్రం ఓపీల్లో రక్త, మూత్ర ఇతరత్రా చిన్న పరీక్షలు కూడా చేయనున్నారు. అయితే సాధారణ ఓపీతో పోల్చుకుంటే సాయంత్రం అంత చిత్తశుద్ధిగా సాగడం లేదనే విమర్శలున్నాయి. వైద్యుల్లో చాలా మందికి ప్రత్యేక ప్రైవేటు క్లినిక్‌లు ఉన్నాయి. వాటికి వెళ్లే హడావుడిలో ఇక్కడ తూతూ మంత్రంగా వైద్యం అందించి జారుకుంటున్నారు. కొందరు సీనియర్ వైద్యులైతే ముఖం చాటేస్తున్నారు. ఫలితంగా రోగులు కూడా సాయంత్రం ఓపీలకు వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. వీటిని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంతోపాటు ప్రత్యేక కౌంటర్లు, బోర్డులు ఏర్పాటు చేస్తే ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది.

# పెంపుడు జంతువులతో తస్మాత్ జాగ్రత్త

ఖమ్మం : ఏటా జులై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే (జూనోటిక్) వ్యాధులనిర్మూలనపై అవగాహన కల్పించటం దీని ముఖ్య ఉద్దేశం.గ్రామాల్లోకి అడవి జంతువులు...

జంతువులు రకరకాల ఆహార ఉత్పత్తులతో పాటు ప్రజలకు ఆత్మీయ నేస్తాలు. ప్రకృతి, మనుషులు, జంతువుల మధ్య విడదీయరాని సంబంధం ఉంది. జనాభా విపరీతంగా పెరుగుతోంది. మరో వైపు అటవీ భూములను వ్యవసాయ క్షేత్రాలుగా చేసి సేద్యం చేయటం వల్ల అడవుల్లోని జంతువులు, పక్షులు జనారణ్యంలోకి వస్తున్నాయి. జంతువుల ద్వారా 70 శాతం రోగాలు మనుషులకు సంక్రమిస్తున్నాయి. ప్రజారోగ్య, పర్యావరణశాఖ, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా పని చేయడం వల్ల పశువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను చాలా వరకు అరికట్టవచ్చు.

సంక్రమించే వ్యాధులు...

పిచ్చికుక్క కాటు ద్వారా రేబిస్, పందులపై ఉండే దోమల కాటు వల్ల మెదడువాపు వ్యాధి, బ్యాక్టీరియా ద్వారా బ్రూసెల్లోసిస్, సాల్మొనెల్లోసిస్, క్షయ, దొమ్మ వంటి వ్యాధులు, ఎలుకలపై ఉండే కీటకాల ద్వారా లెఫ్టోస్పైరోసిస్, పరాన్న జీవుల ద్వారా అంకైలోస్టామియాసిస్, హైడారిటీయోసిస్, గజ్జి, అమీబియాసిస్, పందుల ద్వారా గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. కోళ్లు, పక్షుల ద్వారా ఇన్ఫ్లూయిజా, క్లమీడియోసిస్, లిస్టీరియోసిస్, సాల్మెనెల్లోసిస్, క్షయ, తామర, సిట్టకోసిస్ లాంటి వ్యాధులు మనుషులకు సోకుతాయి.

సన్నిహితంగా ఉండేవారికి ముప్పు



జూనోటిక్ వ్యాధులు పశువులు, జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి త్వరగా సోకుతాయి. కుక్కలతో సన్నిహితంగా ఉండే వారికి రేబిస్, హైడ్రాటియోసిస్, కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధం ఉండే పరిశ్రమల్లో పనిచేసే వారికి, కటిక పని చేసేవారికి దొమ్మ వ్యాధి, డెయిరీ ఫారాల్లో పని చేసే వారికి, పశువైద్యులకు బ్రూసెల్లోసిస్, కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి సిట్టకోసిస్, ధాన్యం గిడ్డంగుల్లో పనిచేసే వారికి లెఫ్టోస్పైరోసిస్, కలుషితమైన పాలు తాగే వారికి క్షయ వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉంది. సుమారు 200కు పైగా జూనోటిక్ వ్యాధులు ఉన్నప్పటికీ ప్రాణాంతమైనవి కావు. రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ మాత్రం ప్రమాదకరమైనవే.జూనోటిక్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా అతి ప్రేమకు పోతే ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. చట్ట ప్రకారం ప్రతి ఒక్కరు జీవులపై కరుణ కలిగి ఉండాలి. జీవహింస నివారణ(శునకాల జనన నియంత్రణ) చట్టం 2023 అనుసరించి వీధి శునకాలను చంపడం, హింసించటం నేరం.బి.వేణుమనోహర్‌రావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఖమ్మం

# మిల్లుల్లో గుట్టలుగా ధాన్యం

ఖమ్మం : జిల్లావ్యాప్తంగా రైస్ మిల్లుల్లో ధాన్యం గుట్టలుగా పేరుకుపోయాయి. గత ఖరీఫ్, రబీ సీజన్లలో పౌర సరఫరాల శాఖ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించింది. మిల్లర్లు ధాన్యాన్ని మర పట్టి బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐ గోదాములకు అప్పగించాల్సి ఉంది. సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) బియ్యం తీసుకునేందుకు తమ గోదాముల్లో ఖాళీ లేదని ఎఫ్‌సీఐ అధికారులు కొర్రీలు వేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని మిల్లర్లు వాపోతున్నారు. దీంతో మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మర పట్టడం లేదు. వర్షాకాలం ప్రారంభమైనందున మిల్లుల ఆవరణలో గుట్టలుగా నిల్వ చేసిన ధాన్యం బస్తాలు వాన నీటికి తడిసి ధాన్యం దెబ్బతింటుందని మిల్లర్లు చెబుతున్నారు. ఎక్కువ రోజులు నిల్వ చేయడం వల్ల ధాన్యం రంగు మారుతోంది. ఈ ధాన్యం మర పట్టగా వచ్చే బియ్యం సైతం పసుపు రంగులోకి మారతాయి. దీంతో ఎఫ్‌సీఐ అలాంటి బియ్యాన్ని నిరాకరిస్తోంది. ఆ సంస్థ వైఖరి వల్ల నష్టపోతున్నామని మిల్లర్లు చెబుతున్నారు. జిల్లాలో



57 రా రైస్ మిల్లులు, 7 పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. వీటికి గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మర పట్టించి బియ్యం తీసుకోవాల్సి ఉండగా పౌర సరఫరాల శాఖ, ఎఫ్‌సీఐ అధికారులు పట్టించుకోవడం లేదు.

గోదాముల్లో ఖాళీ లేదంటున్నారు

బొమ్మ రాజేశ్వరరావు, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు

సీఎంఆర్ రైస్ తీసుకునేందుకు గోదాములు ఖాళీ లేవని ఎఫ్‌సీఐ అధికారులు లారీల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో లారీలు రెండు, మూడు రోజులు గోదాముల వద్దే నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాలోని మిల్లుల్లో రోజుకు 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుంది. ఎఫ్‌సీఐ అధికారులు రోజుకు ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుమతి చేస్తున్నారు. వర్షాలు కురిసి ధాన్యం రంగు మారితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఎఫ్‌సీఐ త్వరగా సరకు దిగుమతి చేసుకోవాలి.

# 4 చోట్లా నవ్విపోయేలా..



అశ్వారావుపేట : 'ప్రతి చెరువూ హైదరాబాద్ ట్యాంకు బండ్‌ను తలపించేలా అందంగా తీర్చిదిద్దాలి. నిధులకు కొరతలేదు. మిషన్ కాకతీయ పథకంలో చెరువులు బాగు చేసుకుందాం. నియోజకవర్గంలో ఒక చెరువును ట్యాంకుబండ్‌గా అందంగా తీర్చిదిద్దాలి' మిషన్ కాకతీయ పథకం ప్రారంభంలో సీఎం కేసీఆర్ చెప్పిన మాటలివి. ఆచరణలో కాకతీయ చెరువుల్లో పూడిక తీశారు. ట్యాంకు బండ్ పనులు అరకొరగానే సాగి ప్రజలకు ఉపయోగం లేకుండా మారాయి. భద్రాద్రి జిల్లాలో అయిదు నియోజకవర్గాలకు నాలుగు చోట్ల మినీ ట్యాంకుబండ్‌లు మంజూరు చేశారు. ఏడేళ్ల కిందట పనులు ప్రారంభించారు. అశ్వారావుపేటలో వెంకమ్మ చెరువు, కొత్తగూడెంలో చుంచుపల్లి విజయనగర్ కాలనీ చెరువు, పినపాకలో మణుగూరులోని నాయుడుకుంట చెరువు, ఇల్లెందులో ఇల్లెందుపాడు చెరువులపై మినీ ట్యాంకుబండ్ పనులు నిర్వహించారు. ఒక్కో ట్యాంకుబండ్‌కు రూ.5కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. ప్రతి ట్యాంకుబండ్‌పై కట్టను తీర్చిదిద్దడం, వాకింగ్ టైల్స్‌తో ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు, సోలార్ లైట్లు, మధ్య మధ్యలో కూర్చొనేందుకు వీలుగా బల్లలు, పిల్లలు ఆడేందుకు జారుడుబల్లలు, ఒక పక్క అందమైన మొక్కలతో గార్డెనింగ్ తయారు చేయాల్సి ఉంది.

చెరువు కట్టలపై మట్టిపనులు మాత్రం వేగంగా చేశారు. తరువాత పనుల్లో వేగం మందగించింది. వాకింగ్ ట్రాక్ కోసం మూడేళ్ల కిందట వేసిన టైల్స్ కొన్ని చోట్ల ఊడిపోతున్నాయి. సోలార్ లైట్లు, జారుడుబల్లలు, అందమైన మొక్కలు లేవు. చెరువు వైపు రెయిలింగ్ లేదు. కట్టలపై కనీసం కంకర రోడ్డూ వేయకపోవడంతో వర్షాకాలం వస్తే బురదలోనే వెళ్లాల్సి వస్తోంది. అసౌకర్యాలతోనే మినీ ట్యాంకు బండ్‌లు నేడు దర్శనమిస్తున్నాయి.ఇటీవలే ఇల్లెందు నియోజకవర్గంలో మినీట్యాంకు బండ్ పనులు మిగిలిన వాటికంటే ఎక్కువగా పూర్తి చేశారు. మణుగూరులో చెరువు కట్టపై మట్టిపోసి ట్రాక్ నిర్మించారు మినహా మిగిలిన పనులు ఏవీ చేయలేదు. కొత్తగూడెంలోని చుంచుపల్లి చెరువుపై వాకింగ్ ట్రాక్ మినహా మరే పని పూర్తికాలేదు. మొత్తం మీద జిల్లాలో మంజూరైన నాలుగు మినీట్యాంకు బండ్ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

అశ్వారావుపేటలో ట్రాక్‌పై రెయిలింగ్, సోలార్ లైట్లు, కట్టపై కంకర మార్గం అన్నీ నెల రోజుల్లో పూర్తి చేయనున్నాం. మధ్యలో గుత్తేదారు ఆలస్యం చేయడం, కట్ట బలపడుతుందని కొంతకాలం ఆపడం జరిగింది. మరో నెల రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.ఐబీ డీఈఈ, బి.కృష్ణ

# రాగి జావ కారుతోంది..!



కొత్తగూడెం : ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే వారికి పౌష్టికాహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు వీడటం లేదు. వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్డు, అల్పాహారంగా రాగిజావ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఉదయాన్నే పిల్లలకు రాగిజావ అందిస్తే వారి ఎదుగుదలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయి. కండరాలు, ఎముకల పుష్టికి ఇది చక్కని పోషకాహారం. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జిల్లాకు 17 చొప్పున పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా గత నెల 20 నుంచి 'రాగిజావ' అందజేతను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. వారంలో మూడు రోజులు (సోమ, బుధ, శుక్రవారం) అందజేయడానికి విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. మిగిలిన మూడు రోజుల్లో ఉడకబెట్టిన కోడిగుడ్లు అందజేయాలి. జులై 1వ తేదీ నుంచి ఉమ్మడి ఖమ్మంలోని అన్ని పాఠశాలల్లో రాగిజావ అందించడానికి సన్నాహాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం ఇంకా ప్రారంభంకాలేదు. చివరకు సాంబారు, నీళ్ల చారు దిక్కుగా మారింది.

ఉభయ జిల్లాల్లో ఇదీ పరిస్థితి

ఖమ్మం జిల్లాలోని 1,264 పాఠశాలల్లో 82,732, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,375 పాఠశాలల్లో 71,840 మంది విద్యార్థులకు రాగిజావ అందించాలి. హడావుడిగా కొన్ని పాఠశాలల్లోనే అల్పాహార కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ప్రతి విద్యార్థికి పది గ్రాముల రాగి పొడిని పది గ్రాముల బెల్లంపొడితో కలిపి చేసిన జావ అందజేయాల్సి ఉంది. మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలిస్తే మండిపడుతున్న కూరగాయలు, నిత్యావసరాల ధరలు ప్రభావం చూపుతున్నాయి. నిర్దేశిత మెనూ అమలు చేసే పరిస్థితి లేదు. మరోవైపు గతేడాది 9, 10వ తరగతి విద్యార్థులకు భోజనం వండిపెట్టిన నిర్వాహకులకు ఆర్నెల్ల బకాయిలు ఇంకా ఖాతాలో జమ చేయలేదు. దీనివల్ల పథకం నిర్వహణ ఆర్థిక భారంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. కోడిగుడ్లకు సంబంధించి రూ.2,57,60,434, కూరగాయల బిల్లులు మరో రూ.1,65,53,182 చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనం రూ.3 వేలు కూడా వెంటనే ఇవ్వాలని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 10లోగా బకాయిలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె తప్పదని ఇప్పటికే హెచ్చరించారు.పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ మధ్యాహ్న భోజనంలో ఉడకబెట్టిన గుడ్లు వడ్డించడం లేదు. గతేడాది బిల్లులు ఇంకా అందకపోవడంతో అప్పు చేసి మరీ ఎలాగోలా విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు కోడిగుడ్లు అరకొరగా సరఫరా చేస్తున్నారు.

ఇది.. కొణిజర్ల మండలం కొండవనమాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు 44 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి ఉదయాన్నే పాఠశాలకు వచ్చే పిల్లలకు రాగిజావ అందించడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

మెనూ అమలుకు చర్యలు

సోమశేఖర్‌శర్మ, డీఈఓఅన్ని పాఠశాలల్లో రాగిజావ అందజేస్తాం. రాగి, బెల్లంపొడులు ఉభయ జిల్లాల కేంద్రాలకు చేరుకున్నాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకుల బకాయిలు వారం రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటాను. కోడిగుడ్లను నిబంధనల ప్రకారం అందించేలా చూస్తాను.

# సింగరేణి ఆసుపత్రుల్లో.. సేవల మెరుగునకు చర్యలు

కొత్తగూడెం : ఉద్యోగులకు తమ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా సింగరేణి యాజమాన్యం అడుగులేస్తోంది. పైస్థాయి దవాఖానాలకు అత్యవసర కేసులు సిఫార్సు చేయాల్సిన అవసరం రాకుండా.. స్థానికంగానే వైద్యం అందించే దిశగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తొలుత వైద్య పోస్టులను ఒప్పంద పద్ధతిన భర్తీ చేసేందుకు సిద్ధమైంది. నెలకు రూ.1,25,000 వేతనం చెల్లిస్తారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏడాది కాంట్రాక్టు పద్ధతిన 12 విభాగాల్లో 25 మంది వైద్యులను నియమించుకొనేందుకు యాజమాన్యం అవకాశాన్ని కల్పించినా.. ఆ తర్వాత ఏటేటా పనిచేసే గడువును పొడిగిస్తూ వస్తోంది. అనస్థీషియన్, ఈఎన్‌టీ సర్జన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, ఆర్థోసర్జన్, ఫిజీషియన్లకు 10న, చెస్ట్ ఫిజీషియన్, హెల్త్ ఆఫీసర్, ఆప్తల్మాలజిస్ట్, పిడియాట్రీషియన్, సైకియాట్రిస్ట్, రేడియాలజిస్టులకు కొత్తగూడెంలోని డైరెక్టర్(పా) కార్యాలయంలో 11వ తేదీన ముఖాముఖిలను నిర్వహించనున్నారు.ఇదీ.. సంగతి సింగరేణిలో కొత్తగూడెం ప్రధాన వైద్యశాలతో పాటు ఆరు ఏరియా వైద్యశాలలున్నాయి. అవి.. శ్రీరాంపూర్, రామగుండం, బెల్లంపల్లి, భూపాలపల్లి, మణుగూరు, ఇల్లెందు ఏరియా వైద్యశాల.అన్ని ఏరియాల్లో మరో 21 డిస్పెన్సరీలు పనిచేస్తున్నాయి. రోజుకు ఐదు వేల మంది వరకు ఓపీలో వైద్య సదుపాయాన్ని పొందుతున్నారు. మరో 400 మంది ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు.సింగరేణి వ్యాప్తంగా 70 మంది స్పెషలిస్టు వైద్యులు, 115 మంది మెడికల్ ఆఫీసర్లు, 30 మంది ఒప్పంద వైద్యులు సేవలందిస్తున్నారు. రోజుకు సగటున 55 నుంచి 60 కేసులను మెరుగైన వైద్యం కోసం ఇతర వైద్యశాలలకు సిఫార్సు చేస్తున్నారు. రోగుల అత్యవసర వైద్యానికి ఏటా రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు వెచ్చిస్తున్నారు. సేవల అప్‌గ్రేడ్ ద్వారా ఈ భారాన్ని తగ్గించేందుకు, సకాలంలో అత్యవసర వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక వైద్య నిపుణుల భర్తీకి చర్యలు చేపడుతోంది.

# జిల్లాలో త్వరలో కు.ని. శస్త్ర చికిత్సలు !

జనగామ : జిల్లాలో సుమారు ఏడేళ్లుగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్న సమయంలో జనగామలో కు.ని. శస్త్రచికిత్సల శిబిరాలు నిర్వహించేవారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా జనగామ జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా కు.ని. శస్త్ర చికిత్సల శిబిరాలు నిర్వహించడం లేదు. దీంతో ప్రజలు కు.ని శస్త్ర చికిత్సల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు.

ఏడేళ్ల తర్వాత..ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పూర్తిస్థాయిలో కుటుంబ నియంత్రణ ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, చేతితో చేసే కు.ని శస్త్ర చికిత్సలు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా రానున్న నెల రోజుల్లో జనగామ జిల్లా ఆసుపత్రితో పాటు బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జఫర్‌గఢ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కు.ని శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. వీటి తర్వాత రఘునాథపల్లి, నర్మెట్ట పీహెచ్‌సీల్లోనూ చేతితో చేసే శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు



సీహెచ్‌సీల్లో ల్యాప్రోస్కోపిక్ కు.ని శస్త్ర చికిత్స చేయడానికి గాను త్వరలో జిల్లాకు రూ.12 లక్షల విలువైన మూడు యంత్రాలు రానున్నాయి. శస్త్ర చికిత్సలకు అవసరమైన మత్తు వైద్యుడు, సర్జన్ వైద్యుడు సిద్ధంగా ఉన్నారు. సంచార వాహనాన్ని సమకూర్చుకొని, ఇద్దరు వైద్యులు, స్టాఫ్ నర్సుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా కు.ని శస్త్ర చికిత్సలు చేయడానికి జిల్లా వైద్యాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కు.ని శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో శస్త్ర చికిత్సకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నారు. చికిత్సల కోసం ప్రత్యేక సంచార వాహనం, యంత్రాలు అందుబాటులోకి రానుండటంతో ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

నెల రోజుల్లో శిబిరాలు పారంభిస్తాం

ఎస్.ప్రశాంత్, జిల్లా వైద్యాధికారి

రానున్న నెల రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కు.ని శస్త్రచికిత్సల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నాం. ఇందుకోసం మూడు యంత్రాలు త్వరలో జిల్లాకు చేరనున్నాయి. జిల్లా ఆసుపత్రి, ఎంపిక చేసిన సీహెచ్‌సీల్లో ఒక్కో వారం చొప్పున కు.ని శస్త్ర చికిత్సలు చేస్తాం. ఒక్కో రోజు 30 మందికి శస్త్ర చికిత్సలు చేస్తాం.

# తుది సర్వేకు రంగం సిద్ధం..!

డోర్నకల్ : విజయవాడ-కాజీపేట సెక్షన్‌లోని పాపటపల్లి (ఖమ్మం జిల్లా), మోటమర్రి-విష్ణుపురం సెక్షన్‌లోని జాన్‌పహాడ్ (సూర్యాపేట జిల్లా) మధ్య కొత్త రైల్వే బ్రాడ్‌గేజ్ లైను నిర్మాణం కోసం తుది స్థాన (ఫైనల్ లోకేషన్) ఖరారు సర్వేకు రంగం సిద్ధమైంది. ప్రతిపాదిత మార్గం పొడవు 93.10 కిలోమీటర్లు ఉండగా దీనిని డోర్నకల్‌కు 8 కిలోమీటర్ల దూరంలో గల పాపటపల్లి రైల్వేస్టేషన్ వద్ద, నడికుడి మార్గంలోని మిర్యాలగూడ రైల్వేస్టేషన్ వద్ద అనుసంధానించనున్నారు. 2022, నవంబరు 24న కొత్త లైను సర్వేకు రైల్వే బోర్డు అనుమతించింది. ఇందుకోసం రూ.3 కోట్లు కూడా కేటాయించగా ఓ ప్రైవేటు సంస్థ ప్రాథమిక సర్వే చేపట్టింది. ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కొన్నిచోట్ల స్థానికులు సర్వేను అడ్డుకోవడంతో ప్రతిష్టంబన ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ అధికారులు దక్షిణ మధ్య రైల్వేకు డీపీఆర్ సమర్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తుది స్థాన ఖరారు సర్వేకు పూనుకున్నారు. ప్రతిపాదిత లైను వెళ్లే మార్గంలో సమస్యాత్మక గ్రామాలకు తోడు ఈ కార్యాచరణ పూర్తి చేయడానికి అవసరమైన చేయూత అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ప్రస్తుతం సింగిల్‌లైన్..డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైనుకు ప్రతిపాదిత మార్గం: ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్ తండా, బోడ వీర, దారేడు, గుండల తండా, గూడూరుపాడు, ఎం.వెంకటాయపాలెం, ఆరెకోడు, ఆరెంపుల, బూరుగూడెం, పొన్నెకల్లు, ముద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ మండలంలోని లక్ష్మీపురం, మేడేపల్లి, ధనియాగూడెం, కట్టూకూరు, నేలకొండపల్లి మండలం ఆరేగూడెం, అచర్లగూడెం, కొనాయిగూడెం, నేలకొండపల్లి, బోదులబండ, పైనంపల్లి గ్రామాలను కలుపుతూ కోదాడ, హుజుర్‌నగర్ మీదుగా కొనసాగనుంది. ప్రస్తుతానికి సింగిల్‌లైను కోసం 8 మీటర్ల భూమి సేకరించాలని నిర్దేశించారు. ఒకవేళ డబ్లింగ్ లైనుకు ఇప్పుడు భూమి సేకరించాలని భావించిన పక్షంలో 15 మీటర్ల మేరకు అవసరమవుతుంది. సూర్యాపేట జిల్లా పరిధిలో 50 కిలోమీటర్ల పొడవు రైల్వేలైను నిర్మాణానికి సర్వే ఇప్పటికే పూర్తయింది.బొగ్గు సరఫరా ముఖ్యోద్దేశం

లిదక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఛీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్)-గుంటూరు ఫైనల్ లోకేషన్ సర్వేకు జూన్ ఒకటిన ఉత్తర్వులు వెలువరించారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని ఖమ్మం జిల్లా యంత్రాంగానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ విద్యుచ్ఛక్తి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేయడం ఈ కొత్త లైను ముఖ్యోద్దేశం. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బొగ్గు గనుల నుంచి డోర్నకల్ మీదుగా మోటమర్రి-విష్ణుపురం మార్గం నుంచి బొగ్గును సరఫరా చేయడానికి 150 కిలోమీటర్లు రవాణా చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పరంగా పరిశీలిస్తే..కొత్త మార్గం నిర్మాణం పూర్తయితే 50 కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో గల గ్రానైట్, ఇనుప ఖనిజం, చెరకు రవాణా అవసరాలకు ఈ కొత్త రైల్వేలైను ఉపయోగపడుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరంగా.. సంగెం మండలం చింతలపల్లి వద్ద ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమ సమీప జిల్లాలవాసులకు చేరువ అవుతుంది. కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేందుకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి దగ్గరవుతుంది. నెక్కొండలోని లక్ష టన్నుల సామర్థ్యం కలిగిన పౌర సరఫరాల గోదాములకు ఇతర జిల్లాల నుంచి దిగుమతులకు మార్గం సుగమమం అవుతుంది.

నేపథ్యమిది2013-14లోనే డోర్నకల్ జంక్షన్-మిర్యాలగూడ రైలు మార్గం సర్వేకు రైల్వేశాఖ సంసిద్ధత వ్యక్తం చేసింది. 2017లో సర్వేకు శ్రీకారం చుట్టారు. 2021, అక్టోబరు 2న సికింద్రాబాద్ రైల్ నిలయంలో నిర్వహించిన సమావేశంలో నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డోర్నకల్-మిర్యాలగూడ మధ్య నిర్మించ తలపెట్టిన కొత్త రైలు మార్గం గురించి ప్రస్తావించారు.




# రూ.47.66లక్షల కోట్లతో బడ్జెట్.. శాఖలు, పథకాల వారీగా కేటాయింపు ఇవే..!

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. కేంద్ర బడ్జెట్‌లో వివిధ శాఖలు, పథకాలకు కేటాయింపులు చేశారు. బడ్జెట్ పరిమాణం మొత్తం రూ.47.66లక్షల కోట్లు కాగా.. వివిధ మార్గాల ద్వారా ఆదాయం రూ.30.80లక్షలకోట్లుగా అంచనా వేశారు.

బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ గత 10 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఇది సాధ్యమైందన్నారు. ఆయన ప్రధాని అయ్యాక ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయని.. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ మంత్రంతో ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొన్నట్లు వివరించారు.

**బడ్జెట్‌లో వివిద శాఖలు.. పథకాలకు కేటాయింపుల ఇలా..** మౌలిక వసతుల రంగానికి రూ.11.11లక్షల కోట్లు, రక్షణశాఖకు రూ.6.2లక్షల కోట్లు, రైల్వేశాఖకు రూ.2.55లక్షల కోట్లు, హోంశాఖకు రూ.2.03లక్షల కోట్లు, వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.1.27లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1.77లక్షల కోట్లు, ఉపరితల రవాణా, జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.2.78లక్షలకోట్లు, ఆహారం, ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.2.13లక్షల కోట్లు, రసాయనాలు, ఎరువుల కోసం రూ.1.68లక్షలకోట్లు, కమ్యూనికేషన్ రంగానికి రూ.1.37లక్షలకోట్లు, గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ.86వేలకోట్లు, ఆయుష్మాన్ భారత్ పథకానికి రూ.7500కోట్లు, పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.6,200కోట్లు, సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే ఎకో వ్యవస్థల తయారీకి రూ.6,903కోట్లు, సోలార్ విద్యుత్ గ్రిడ్‌కు రూ.8500కోట్లు, గ్రీన్ హైడ్రోజన్‌కు రూ.600కోట్లు.

# పన్ను విధానాల్లో ఎటువంటి మార్పులు లేవు: ఆర్థిక మంత్రి

ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో పన్ను విధానాల్లో మార్పుల జోలికి ఆర్థిక మంత్రి వెళ్లలేదు. ఆదాయపు పన్ను కొత్త విధానంలో వారికి రూ.7లక్షల వరకు ఎటువంటి పన్ను ఉండదని పునరుద్ఘాటించారు. ఇది 2013-14లో రూ.2.2 లక్షలుగా ఉందని గుర్తు చేశారు. కార్పొరేట్ పన్నును దేశీయ కంపెనీలకు 30శాతం నుంచి 22శాతానికి.. కొన్ని రకాల తయారీ రంగ సంస్థలకు 15శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. ప్రజల సగటు వాస్తవిక ఆదాయం 50శాతం పెరిగినట్లు చెప్పారు. ప్రత్యక్ష పన్నులకు సంబంధించి వివాదాస్పద డిమాండ్ నోటీసులు అందుకొన్న వారికి ఊరటనిచ్చారు. 2009-10 మధ్య రూ.25 వేల వరకు విలువైన డిమాండ్ నోటీసులను ఉపసంహరించుకొన్నారు. 2010-11 నుంచి 2014-15 ఆర్థిక సంవత్సరాల మధ్య రూ.10వేల వరకు చెల్లించాలని జారీ అయిన నోటీసులను రద్దు చేశారు. దీంతో దాదాపు కోటి మంది లబ్ధి పొందనున్నట్లు ఆమె తెలిపారు. వ్యాపారాలను సరళతరం చేయడానికి ఈ నిర్ణయం తీసుకొన్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో చిన్న మొత్తంలో ఉన్న ప్రత్యక్షపన్ను వివాదాస్పద డిమాండ్ల (నోటీసులు)ను రద్దు చేసుకొంటున్నట్లు వివరించారు. ఆదాయపు పన్ను రిఫండ్ సమయాన్ని తమ ప్రభుత్వం గణనీయంగా తగ్గించిందని ఆర్థిక మంత్రి వెల్లడించారు. 2013-14లో ఇది సగటున 93 రోజులు ఉండగా.. ప్రస్తుతం దానిని 10 రోజలకు తీసుకురాగలిగామని వెల్లడించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 'సలహాల' ఖర్చు రూ.680 కోట్లు: నాదెండ్ల మనోహర్



విజయవాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నట్లు జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇవ్వడం గొప్ప విషయమని.. దీన్ని 2029 వరకు పొడిగించడం అభినందనీయమన్నారు. పర్యటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా కేంద్రం సహకరిస్తోందన్నారు. ముఖ్య పట్టణాలకు మెట్రో విస్తరించాలని నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాదెండ్ల మాట్లాడారు. "సీఎం జగన్ హయాంలో 2019 నుంచి ఇప్పటివరకు సుమారు 80 నుంచి 90 మంది సలహాదారులు, ఉప సలహాదారులను నియమించారు. వీరంతా ప్రభుత్వానికి ఏ విధంగా సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వీరికి అనవసరంగా నిధులు కేటాయిస్తున్నారని గతంలో హైకోర్టులో పిల్ వేశాం. న్యాయస్థానం స్పందిస్తూ.. దేని కోసం ఇంతమందిని నియమించారు? ఎలాంటి సలహాలు ఇస్తున్నారు? వాటిని ఎక్కడైనా అమలు చేస్తున్నారా? సలహాదారుల విధానం అనవసరం అని కోర్టు అభిప్రాయపడింది. సలహాదారుల నియామకానికి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది" అని నాదెండ్ల చెప్పారు. సలహాదారుల నియామకంలో నూతన విధానాన్ని తీసుకొస్తున్నట్లు మార్చి 2023లో హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. అర్హులనే నియమిస్తున్నట్లు పేర్కొంది.

అయితే, సలహాదారులుగా నియమితులైనప్పటికీ సీఎంను కూడా కలవలేకపోతున్నామని కొందరు వాపోతున్నారు. ఈ అడ్వైజర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వెచ్చించింది సుమారు రూ.680 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కోసమే రూ.140 కోట్లు ఖర్చు చేయడం గమనార్హమని నాదెండ్ల పేర్కొన్నారు. అసలు వీరంతా ఎవరనేది ప్రజలకు తెలియాలి, ప్రభుత్వం వారి పేర్లను ప్రకటించాలి. ఎవరెవర్ని ఏ శాఖకు కేటాయించారనేది రాబోయే శాసనసభ సమావేశాల్లో సీఎం జగన్ చెప్పాలి అని నాదెండ్ల డిమాండ్ చేశారు. అలాగే ఆ సలహాదారులు పరిపాలనకు ఏ విధంగా ఉపయోగపడుతున్నారు అనేది కూడా చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆ ఇద్దరి గురించి మాట్లాడితే తాట తీస్తా.. నానిపై బుద్దా వెంకన్న ఫైర్





విజయవాడ, ఫిబ్రవరి 1: విజయవాడ ఎంపీ కేశినేని నానిపై టీడీపీ నేత బుద్దా వెంకన్న మరోసారి ఫైర్ అయ్యారు. తనకు టిక్కెట్ ఇవ్వాలంటూ బుద్దా వెంకన్న గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేశినేని నాని అనే కుక్కకు బుద్ధి చెప్పాలని ర్యాలీగా వచ్చినట్లు తెలిపారు. కేశినేని నాని వాపును చూసి బలుపు అనుకుంటున్నారని విమర్శించారు. తాను అప్లికేషన్ పెట్టడానికి వస్తేనే భారీగా కేడర్ వచ్చారన్నారు.

చంద్రబాబు - పవన్ గురించి చెడుగా మాట్లాడే కుక్కల తాట తీస్తానని హెచ్చరించారు. "దమ్ముంటే రండి...మీరో మేమో చూసుకుందాం. చంద్రబాబు నాకు దైవ సమానులు.

చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తాను. సీటు రాలేదని మా పార్టీ వాళ్ళెవరైనా సరే చంద్రబాబును విమర్శిస్తే తాట తీస్తాను" అంటూ బుద్దా వెంకన్న వ్యాఖ్యలు చేశారు.

# ఏపీలో ప్రజాకంటక పాలన సాగుతోంది: పురంధేశ్వరి

ఏలూరు: ఏపీలో ప్రజాకంటక పాలన సాగుతోందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. గురువారం నాడు భీమవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ... ఏపీ బీజేపీ చరిత్రలో నేడు అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 24 పార్లమెంటు ఎన్నికల కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు కార్యాలయాలు గుండెకాయలయితే , కార్యకర్తలు గుండె చప్పుళ్లలాంటివారని అన్నారు. బీజేపీ కార్యకర్తలను గౌరవిస్తుందని.. అందుకే ఛాయ్ అమ్ముకునే వ్యక్తి పీఎం అయ్యారన్నారు. బీజేపీ కుటుంబ పార్టీ కాదని.. ఏ పార్టీలోనూ కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం ఉండదని తెలిపారు. కేంద్రంలో గతంలో ఇతర పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో ప్రతీరోజూ అవినీతి ఆరోపణలు వచ్చేవని.. ఇప్పుడు మోదీ పాలనలో ప్రతీ రోజూ కొత్త స్కీములను ప్రవేశపెడుతున్నారని వివరించారు. ప్రధాని మోదీ మహిళలకు పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, మహిళా నాయకత్వాన్ని ప్రోత్సాహిస్తున్నారని అన్నారు. బీజేపీ అన్ని పార్టీల కంటే భిన్నమైనదని.. ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. 2019 ఎన్నికల్లో 302 పార్లమెంటు సీట్లు గెలుచుకుంటే, రాబోయే ఎన్నికల్లో 350 సీట్లకు పైగా గెలుచుకుంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారన్నారు. నియంతృత్వం, విద్వేషం, విధ్వంసాలతో కూడిన పాలనను ఏపీలో గత అయిదేళ్లుగా చూస్తున్నామని పురంధేశ్వరి తెలిపారు.



**వైసీపీ అవినీతిని ప్రశ్నిస్తే.. ఎస్సీ, ఎస్టీ కేసులు :** అధికారంలో ఉన్న పార్టీ తప్పు చేస్తే, దానిని ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతి సామాన్యుడిపై ఉందన్నారు. అలా ఎవరైనా వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతూ జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. సామాజిక సాధికారిక యాత్ర పేరుతో యాత్ర చేస్తున్న వైసీపీకు.. ఆ నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు. అమరావతి రాజధాని అని విశ్వసించి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఏపీ అభివృద్ధి కోసం కేటాయించిందని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టును వారికి అనుకూలమైన మేఘా కంపెనీకి ఇచ్చారని మండిపడ్డారు. ప్రాజెక్టు డిజైన్ సరిగ్గా లేకపోవడంతోనే పనులు మూలన పడ్డాయని చెప్పారు. కాంగ్రెస్‌కు ఏపీలో కొత్త అధ్యక్షురాలు వచ్చారని..ఇప్పుడు ప్రత్యేక హోదా అంటున్నారన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం అంటే, ప్రత్యేక ప్యాకేజీకి గతంలో అంగీకరించ లేదా అని ప్రశ్నించారు. బీజేపీ ఏపీకి ఏ విధంగానూ అన్యాయం చేయలేదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను.. రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా సీఎం జగన్ ప్రకటిస్తూ.. స్టిక్కర్లు అంటించుకుంటున్నారని.. అందుకే జగన్ ప్రభుత్వం స్టిక్కర్ల ప్రభుత్వంగా మిగిలిపోతుందని పురంధేశ్వరి ఎద్దేవా చేశారు.

# మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి సిఎం జగన్ దాగా: చిరంజీవి రావు

విశాఖ: మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దాగా చేశారని, ఇప్పుడు ఎన్నికలు ఉన్నందువలనే డిఎస్సీ అని చెప్పి మళ్లీ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు విమర్శించారు.

ఈ సందర్భంగా గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2019 సాధారణ ఎన్నికలకు వెళ్లే ముందు రాష్ట్రంలో 2 లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, టచర్ పోస్టులు అయితే 23 వేలకుపైగా ఖాళీగా ఉన్నాయన్నారు.

కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఉద్యోగాల్లో అప్రంటీస్ షిప్ తీసుకురావాలని చూస్తున్నారని, భీమిలిలో సిద్ధం సభ చారిత్రక తప్పిదమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు అన్నారు.

# శ్రీశైలంలో నారా లోకేష్ దంపతుల ప్రత్యేక పూజలు







నంద్యాల, ఫిబ్రవరి 1: శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, బ్రాహ్మణి గురువారం దర్శించుకున్నారు. శ్రీశైలం ఆలయం రాజగోపురం వద్ద లోకేష్, బ్రాహ్మణిలకు అర్చకులు, ఏఈవో హరిదాస్, అధికారులు స్వాగతం పలికారు.

లోకేష్ దంపతులు ధ్వజస్తంభానికి నమస్కరించి భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకేష్ దంపతులు వేద పండితుల వేద ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ అధికారులు లోకేష్ దంపతులకు అమ్మవారి ప్రసాదంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కాగా... శ్రీశైలం పర్యటనలో భాగంగా ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి సున్నిపెంట హెలిప్యాడ్‌కు లోకేష్ దంపతులు చేరుకున్నారు.

ఈ సందర్భంగా నారా లోకేష్ దంపతులకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, నందికొట్కూరు టీడీపీ ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్థన్ రెడ్డి, ఇతర నేతలు ఘన స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో సాక్షిగణపతి ఆలయానికి యువనేత చేరుకున్నారు. సాక్షి గణపతి ఆలయాన్ని దర్శించిన లోకేష్... కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.










దిల్లీ: నేడు బడ్జెట్ పండగ. ఫిబ్రవరి ఒకటిన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కురిపించే వరాల జల్లు కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురుచూసిన విషయం తెలిసిందే. అలాగే ప్రతి ఏడాది ఈ ప్రత్యేకమైన రోజున ఆమె ధరించే చీరలపైనా అందరి దృష్టి ఉంటుంది. ఈ రోజు బడ్జెట్ ట్యాబ్ పట్టుకొని నీలంరంగు చీరలో కనిపించారు. ఈ టస్సర్ పట్టు చేనేత చీర.. గోధుమ రంగులో బెంగాలీ సంస్కృతిని ప్రతిబింబించే ఎంబ్రాయిడరీతో మెరిసిపోయింది. ఈ నీలివర్ణాన్ని తమిళనాడులో 'రామా బ్లూ' అని పిలుస్తారు.

ఇటీవల అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠకు సంకేతంగా ఆమె ఈ రంగు చీరను ధరించారు. మొత్తంగా అటు బెంగాల్, ఇటు తమిళనాడు సంప్రదాయాలను కలగలిపిన చీరతో ఆమె మరోసారి ప్రత్యేకత చాటుకున్నారు. ఆమె 2019లో ఆర్థికమంత్రిగా బాధ్యతలు తీసుకున్న దగ్గరి నుంచి ఈ రోజు వరకు చేనేత చీరే ధరిస్తున్నారు. వాటిపై తన ప్రేమను ఓ సందర్భంలో ప్రస్తావించారు కూడా.

సిల్క్, కాటన్ ఏదైనా కానీ.. ఒడిశా చేనేత చీరలు నాకిష్టమైన వాటిలో ఒకటి. వాటి రంగు, నేత పని, ఆకృతి బాగుంటాయి' అని వెల్లడించారు. 2023లో బ్రౌన్ రంగులో టెంపుల్ బోర్డర్‌లో ఉన్న ప్రకాశవంతమైన ఎరుపు చీరతో కనిపించారు.

2022లో మెరూన్ రంగు చీరను ధరించారు. ఇది కూడా ఒడిశాకు చెందిన చేనేత చీరే. ఆ రంగు దుస్తుల్లో ఆమె చాలా సాదాసీదాగా కనిపించారు. ఇది ఆమె నిరాడంబరతకు నిదర్శమని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. 2021లో ఎరుపు-గోధుమ రంగు కలగలిసిన భూదాన్ పోచంపల్లి చీరలో కనిపించారు. తెలంగాణకు చెందిన ఈ పోచంపల్లిని సిల్క్ సిటీ ఆఫ్ ఇండియాగా పిలుస్తారు.

2020లో నీలం రంగు అంచులో పసుపుపచ్చ-బంగారు వర్ణంలో ఉన్న చీర కట్టులో మెరిశారు. ఈ రంగు శ్రేయస్సు, సమృద్ధిని సూచిస్తుంది. అలాగే 'ఆస్పిరేషనల్ ఇండియా' థీమ్‌కు అనుగుణంగా దీనిని ధరించారు. 2019లో మంగళగిరి గులాబీ రంగు చీర కట్టుకున్నారు. ఆ సమయంలో బడ్జెట్ పత్రాలు తెచ్చే సూట్‌కేస్ స్థానంలో బహీ ఖాతాతో మీడియా ముందుకువచ్చారు.




దిల్లీ: విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుకు 53 ఎకరాల భూమిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఇప్పటికే అడిగామని, అయితే ప్రభుత్వం ఇంకా అప్పగించలేదని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. జోన్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధమైందని, భూమి ఇస్తే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాజపా అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో రైల్వే అభివృద్ధికి రూ.886 కోట్ల నిధులు ఇవ్వగా, ప్రస్తుత బడ్జెట్లో ఒక్క ఏపీకే రూ.9,138 కోట్లు కేటాయించామని తెలిపారు. ఆంధ్రాలో ఏడాదికి 240 కి.మీ. మేర నూతన ట్రాక్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. 98 శాతం లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయన్నారు.

**తెలంగాణకు రూ.5,071 కోట్లు :** తెలంగాణలో రైల్వేల కోసం రూ.5,071 కోట్లు కేటాయించినట్లు అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద శాతం విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. గత పదేళ్లలో వివిధ చోట్ల 414 ఫ్లైఓవర్లు, అండర్ పాసేజ్‌లు నిర్మించినట్లు తెలిపారు. రైల్వేపై రాష్ట్రంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేసిన ఆయన.. పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

# జగన్ - సజ్జలపై బాలినేని ఫైర్




ప్రకాశం జిల్లా: ఒంగోలు లోక్ సభ ఇన్చార్జ్‌గా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియామకంపై బాలినేని శ్రీనివాసరెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. నిన్న చెవిరెడ్డికి పార్టీ బాధ్యతలు ఇచ్చేది లేదని బాలినేనికి చెప్పిన వైసీపీ పెద్దలు.. 24 గంటలు గడవకముందే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ప్రకాశం జిల్లా బాధ్యతలు అప్పగించారు. సీఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి తీరుపై భగ్గుమన్న మాజీ మంత్రి బాలినేని సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. అనుచరుల ఫోన్లకు అందకుండా తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. కాగా వైసీపీ అధిష్టానం బాలినేని శ్రీనివాసుల రెడ్డికి షాక్ ఇచ్చిందని చెప్పవచ్చు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ప్రకాశం జిల్లా బాధ్యతలు అప్పగించడంతోపాటు ఒంగోలు పార్లమెంట్ స్థానంలో పోటీ చేసే అవకాశం ఇస్తారని గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన సంకేతాలను బాలినేనికి వైసీపీ పెద్దలు ఇచ్చారు. అయితే ఒంగోలు నుంచి చెవిరెడ్డి పోటీని అంగీకరించనని స్పష్టం చేస్తూ.. విజయవాడలో వైసీపీ అధిష్టానం వద్ద పంచాయతీ పెట్టారు. దీంతో చెవిరెడ్డి ఒంగోలులో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామని, పార్టీ బాధ్యతలు అప్పగించమని చెప్పి బాలినేనిని బుజ్జగించారు. నిన్న ఒంగోలు చేరుకున్న బాలినేని.. ఇక్కడ పార్లమెంట్ స్థానంలో ఎవరు పోటీ చేస్తే నాకేంటి? తన పని తాను చూసుకుంటానని మీడియాతో అన్నారు. సాయంత్రానికే చెవిరెడ్డిని ఒంగోలు పార్లామెంట్ ఇన్చార్జ్‌గా నియమిస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో తనకు చెప్పిందొకటి.. చేసిందొకటి అంటూ బాలినేని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

## అనసూయ గ్లామర్.. ఈసారి ఇంకాస్త కొత్తగా..

బుల్లితెరపై యాంకర్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది అనసూయ. యాంకర్ గా కెరీర్ స్టార్ట్ చేసి ఇప్పుడు నటిగా తనదైన శైలిలో దూసుకుపోతోంది. వరుస సినిమాల్లో అవకాశాలు సొంతం చేసుకుంటోంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో ఊహించని విధంగా రియాక్ట్ అవుతుంటుంది. ఎప్పటికప్పుడు తన కొత్త ఫొటోలతో సందడి చేస్తుంటుంది. సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఈ అమ్మడు.. వీలు దొరికినప్పుడల్లా ఫ్యామిలీతో కలిసి ఫారిన్ ట్రిప్స్ వేస్తుంటుంది. అక్కడ ఫుల్ చిల్ అవుతూ ఫొటోలు షేర్ చేస్తుంటుంది. ఇంట్రెస్టింగ్ క్యాప్షన్స్ తో పోస్ట్ చేసి అట్రాక్ట్ చేస్తుంటోంది. అప్పుడప్పుడు తన భర్త శశాంక్, ఇద్దరి పిల్లలతో దిగిన కంప్లీట్ ఫ్యామిలీ పిక్స్ ను పోస్ట్ చేస్తుంటుంది. తాజాగా ఈ అమ్మడు మళ్లీ తన ఫ్యామిలీతో కలిసి ట్రిప్ వేసింది. ఇటీవలే విండో పక్కన కూర్చుని కాఫీ తాగుతూ దిగిన కిర్రాక్ ఫొటోలను షేర్ చేసిన అనసూయ.. తాజాగా ఓ టూరిస్ట్ ప్లేస్ లో తీసుకున్న పిక్స్ ను పోస్ట్



చేసింది. ట్రెండీ క్యాప్ పెట్టుకుని, స్కై బ్లూ కలర్ సింగిల్ పీస్ డ్రెస్ లో సోషల్ మీడియాలో ఒక్కసారిగా హీట్ పెంచింది. కొన్ని ఫొటోల్లో క్యూట్ గా.. మరికొన్ని పిక్స్ లో క్లైమేట్ చాలా హాట్ గా ఉన్నట్లు పోజులు ఇచ్చింది. 2024లో ఫస్ట్ వెకేషన్ అంటూ హ్యాష్ ట్యాగ్ యాడ్ చేసింది. ప్రస్తుతం అనసూయ. క్యారెక్టర్ రోల్స్, విలన్ పాత్రలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. 2023లో తెలుగులో ఆమె నటించిన ఐదు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. మైఖేల్, రంగమార్తాండ, విమానం, పెదకాపు, ప్రేమ విమానం చిత్రాల్లో డిఫరెంట్ రోల్స్ చేసింది అనసూయ. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పుష్ప 2లో నెగెటివ్ షేడ్ రోల్‌లో కనిపించబోతోంది. మరోవైపు, ఫ్లాష్ బ్యాక్ అనే మూవీతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది ఈ అమ్మడు. ప్రభుదేవా హీరోగా నటిస్తున్న ఈ మూవీ త్వరలోనే రిలీజ్ కానుంది. ఫ్లాష్ బ్యాక్ తో పాటు మరికొన్ని తమిళ సినిమాలకు అనసూయ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మలయాళంలో మమ్ముట్టి హీరోగా నటించిన భీష్మపర్వంలో అనసూయ కీలక పాత్ర పోషించింది. అలా అనసూయ.. చేతినిండా మూవీలతో బిజీ బిజీగా గడుపుతోంది.

## ఆ భూకంపం తర్వాత మృణాల్ ఇంట్లోనూ భూకంపమే!

నేచురల్ స్టార్ నాని..మృణాల్ ఠాకూర్ నటించిన ఏమోషనల్ ఎంటర్ టైనర్ హాయ్ నాన్న మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. తండ్రి-కుమార్తెల రిలేషన్ షిప్...భార్యాభర్తల మధ్య రిలేషన్ షిప్ ని హైలైట్ చేస్తూ తెరకెక్కించిన సినిమా ఆడియన్స్ కి బాగా కనెక్ట్ అయింది. నాని..మృణాల్ ఎవరి పాత్రల్లో వారు అభినయించిన తీరు మంచి పేరు తీసుకొచ్చింది. తండ్రిగా నాని....తల్లిగా మృణాల్ నటన పరంగా ఇద్దరు ఒకరికొకరు పోటీ పడి నటించారు. అందులో పాప పాత్రని ఎంత గొప్పగా హైలైట్ చేసారో తెలిసిందే. పాప చుట్టూ తిరిగే ఆ కథకి అంతా కనెక్ట్ అయ్యారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ లో ఎదురైన అనుభవాన్ని మృణాల్



ఠాకూర్ గుర్తు చేసుకుంది. సినిమాలో ఆసుపత్రి సన్నివేశంకి సంబంధించిన షూట్ లో మృణాల్ ఏమోషనల్ గా..వ్యక్తిగతంగా ఎంతగా కనెక్ట్ అయిందో చెప్పుకొచ్చింది. సరిగ్గా ఆ సన్నివేశం చిత్రీకరించే ముందు మృణాల్ ఓవీడియో చూసిందిట. దీంతో ఆ సన్నివేశంలో మరింత ఒదిగిపోయి నటించినట్లు తెలిపింది. చిత్రీకరణకు కొద్దిసేపటి ముందు భూకంపం కారణంగా తల్లి తన బిడ్డను కోల్పోయిన హృదయ విదారక ఓ వీడియోను చూసాను. అది నన్ను ఎంతో బావోద్వేగానికి గురి చేసింది. ఆ వీడియో ఇప్పటికీ నా కళ్ల ముందు ఆడుతూనే ఉంది. క్షణాల్లోనే అంతా జరిగిపోయింది. అలాంటి సమయంలో బాధితులు ఎలాంటి పరిస్థితుల్లోకి వెళ్లిపోతారో ఊహించగలను. మనిషిని మానసికంగా చంపేసే దృశ్యాలేవి. ప్రకృతి వైపరిత్యంగా కారణంగా మృతి చెందితే ఎవర్నీ బాధ్యుల్ని చేయగలం. ఎవర్నీ ప్రశ్నించగలం. ఆ సన్నివేశం నా హృదయాన్ని ఎంతో బలంగా తాకింది.ఆ వీడియో చూసిన తర్వాత నా సినిమాలో ఏమోషనల్ సీన్ లో మరింతగా ఒదిగిపోయాను. కానీ బిడ్డలు దూరమైతే ఆ తల్లిదండ్రులకు తీరని శోకంగానే ఉంటుంది అని అంది.




## తలపతి విజయ్.. మళ్ళీ షాక్ ఇచ్చేలా ఉన్నాడట




కోలీవుడ్ స్టార్ హీరో తలపతి విజయ్ గత ఏడాది 'లియో' సినిమాతో భారీ సక్సెస్ అందుకొని ప్రస్తుతం విజయ్ వెంకట్ ప్రభు డైరెక్షన్లో 'గోట్' అనే సినిమా చేస్తున్నాడు. టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాని జూన్ లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కాగా ఈ సినిమా తర్వాత విజయ్ కొన్నాళ్లపాటు సినిమాలకు బ్రేక్ తీసుకోబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'గోట్' తర్వాత ఒకే ఒక్క సినిమా చేసి సినిమాల నుండి బిగ్ బ్రేక్ తీసుకోవాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సినిమాను కూడా వీలైనంత త్వరగా పూర్తిచేసి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికలలో విజయ్ పోటీ చేయబోతున్నట్లు ఇప్పటికే వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. విజయ్ పొలిటికల్ ఎంట్రీ దాదాపు ఖరారు అయిపోయిందని, అందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, త్వరలోనే విజయ్ ఢిల్లీ కూడా వెళ్ళబోతున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వెంకట్ ప్రభు సినిమా తర్వాత విజయ్ నటించబోయే సినిమా కోసం పలు తెలుగు, తమిళ నిర్మాణ సంస్థలతో చర్చలు జరుగుతున్నయని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే పలువురు అగ్ర నిర్మాతలు విజయ్ కి భారీ రెమ్యూనరేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. తన రాజకీయ ప్రచారానికి డబ్బు చాలా అవసరం కాబట్టి విజయ్ కూడా తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం భారీ రెమ్యూనరేషన్ తీసుకోవాలని అనుకుంటున్నారట. అందుకే విజయ్ నెక్స్ట్ ప్రాజెక్ట్ విషయంలో భారీగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇక ఈ క్రూషియల్ ప్రాజెక్టుకి కార్తిక్ సుబ్బరాజ్ మొదటి ఆప్షన్ గా ఉన్నట్లు తెలుస్తోంది. మరి విజయ్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏ నిర్మాణ సంస్థతో చేస్తాడు? ఆ ప్రాజెక్టుకి డైరెక్టర్ ఎవరు? అనేది తెలియాలంటే కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే.

అయితే టాలీవుడ్ నుంచి '%===%' నిర్మాత %ణ.ఎ% దానయ్య విజయ్ తో ఓ సినిమా నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని, ఇందుకోసం విజయ్ కి భారీ స్థాయిలో రెమ్యునరేషన్ ఇచ్చేందుకు కూడా రెడీగా ఉన్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

## భామాకలాపం 2 టీజర్: నవ్విస్తూనే దడ పుట్టించారు!




భార్య మంచిగా మారడం కోసం అపార్ట్ మెంట్ మారాలనుకునే అమాయక భర్త... అమాయకంగా కనిపిస్తూనే దారుణ హత్యలు చేసే భామ వ్యవహారం చూస్తుంటూ ఇది హీస్ట్ ఫీస్ట్ అనకుండా ఉండలేం! ఇటీవల విడుదలైన భామాకలాపం 2 ఎ డెలీషియస్ హీస్ట్ ఫీస్ట్ ఫస్ట్ లుక్ ఆకట్టుకోగా, టీజర్ ఇప్పుడు మరింత సంచలనంగా మారింది. హాయిగా నవ్వుకుంటూనే థ్రిల్స్ ని ఎంజాయ్ చేసేందుకు స్కోప్ ఉంది ఇందులో. ఆహా లో టీజర్ దూసుకుపోతోంది.

శరణ్య తన భాగస్వామితో కలిసి థ్రిల్లింగ్ హీస్ట్ అడ్వెంచర్‌ను ప్రారంభించగా, అనుపమ అనే అమాయకపు గృహిణిగా ప్రియమణి తన పాత్రను తిరిగి పోషించింది. భామా కలాపం భారీ వ్యూస్ తో గొప్ప ఆదరణ దక్కించుకోగా, ఇప్పుడు పార్ట్ 2 పైనా పెద్ద అంచనాలేర్పడ్డాయి. టీజర్ ఆరంభంలోనే అపార్ట్ మెంట్ మారడానికి కారణమేమిటో అమాయకపు గృహిణి అనుపమకు చెబుతుంటాడు భర్త. అవును మంచిగా మారుతున్నాను అంటూనే అనుపమ చేసే అరాచకం మామూలుగా లేదు. అపార్ట్ మెంట్ కల్చర్ లో అదిరిపోయే మర్డర్ మిస్టరీ ఈ సిరీస్ అని అర్థమవుతోంది. ఇందులో అనుక్షణం థ్రిల్స్ కి కొదవేమీ లేదని టీజర్ చెబుతోంది. భర్తకు మాటిచ్చిన తర్వాత అనుపమ దారుణంగా హత్య చేస్తున్న సీన్ .. భారీ భవంతిలో అతిపెద్ద దోపిడీతో ముడిపడి ఉన్న భారీ గందరగోళంలో తనకు తెలియకుండానే చిక్కుకునే అనుపమ కథేమిటన్నది విచిత్రంగానే ఉంది. ఈ థ్రిల్లింగ్ హీస్ట్ అడ్వెంచర్‌లో ప్రియమణి , శరణ్య ప్రదీప్ టైమింగ్ నవ్వులు పూయిస్తుంది. ఫిబ్రవరి 16న భామాకలాపం 2 ప్రీమియర్ ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. సీరత్ కపూర్, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ తదితరులు ఇందులో నటించారు. ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందించగా, వెబ్ ఒరిజినల్‌కి దీపక్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. విప్లవ్ ఎడిటింగ్ వర్క్ చేసారు. ఈ చిత్రాన్ని ఆహా స్టూడియోస్‌తో కలిసి బాపినీడు-సుధీర్ ఈదర అసోసియేషన్ డ్రీమ్ ఫార్మర్స్ నిర్మిస్తున్నారు.

## బేబమ్మ అలా చేస్తానన్నా ఛాన్స్ ఇవ్వట్లేదా..!

అంతకుముందు మోడల్ గా చేసిన కృతి శెట్టి ఉప్పెన సినిమాతో తెలుగు తెరకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే పాత్ర పేరు పెట్టి పిలిచే రేంజ్ అందుకుంది. ఫస్ట్ సినిమా బ్లాక్ బస్టర్ పడితే కెరీర్ జెట్ స్పీడ్ లో వెళ్తుంది. అలానే బేబమ్మకి కూడా వరుసగా అరడజను ఛాన్స్ లు వచ్చాయి. అవకాశాలు వస్తే కాదంటే ఎలా అనుకుని వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వెళ్లింది. అయితే వాటిలో హిట్ అయిన సినిమాల కన్నా ఫ్లాప్ అయినవే ఎక్కువ ఉన్నాయి. మొదటి సినిమా నుంచి ఏడు ఎనిమిది సినిమాల తర్వాత చూస్తే అప్పటికే ఫ్లాప్ హీరోయిన్ గా ముద్ర పడిపోయింది. హీరోయిన్స్ కెరీర్ వారి టాలెంట్ మీద ఆధారపడి ఉంటాయన్నది ఎంత నిజమే ఎంతో కొంత లక్ మీద కూడా డిపెండ్ అవుతాయన్నది కూడా నిజం. ఈ క్రమంలో బేబమ్మ కి ఈమధ్య బ్యాడ్ లక్ కొనసాగుతుంది. తను ఏం చేసినా సరే అది వర్క్ అవుట్ అవ్వట్లేదు. ఇక పరిశ్రమలో హిట్ వస్తే ఎలా ఎంకరేజ్ చేస్తారో ఫ్లాప్ వస్తే అంతే దూరం పెడతారు. ప్రస్తుతం



మంగుళూరి భామ పరిస్థితి అదే అయ్యింది. కృతి శెట్టి కి అవకాశాలు లేక ఖాళీగా ఉంది. ప్రస్తుతం అమ్మడు శర్వానంద్ సినిమాలో మాత్రమే నటిస్తుంది. ఈ సినిమా తర్వాత తెలుగు సినిమా ఆఫర్ ఒక్కటి కూడా లేదు. అవకాశాల కోసం ఈమధ్య గ్లామర్ ట్రీట్ ఇస్తూ ఫోటో షూట్ కూడా చేస్తుంది బేబమ్మ. తను ఇక మీదట గ్లామర్ పాత్రలకు ఓకే అని హింట్ ఇస్తున్నా ఎవరు పట్టించుకోవట్లేదు. తన మేనేజర్ తో రెమ్యునరేషన్ కూడా అటు ఇటుగా తీసుకుందాం ముందు సినిమాలు దక్కించుకోవాలని అంటుందట. ఉప్పెన హిట్ ఆ తర్వాత శ్యాం సింగ రాయ్, బంగార్రాజు ఇలా 3 హిట్లు పడగానే కోటి రెమ్యునరేషన్ డిమాండ్ చేసిన కృతి శెట్టి ఇప్పుడు ఆ రెమ్యునరేషన్ విషయంలో కూడా పెద్దగా పట్టించుకోవట్లేదట. ముందు ఆఫర్ ఇవ్వండి పారితోషికం మీరు ఎంత ఇచ్చినా ఓకే అనే పరిస్థితి ఏర్పడిందట. అందుకే తెలుగులో కన్నా ఇతర భాషల మీద ఫోకస్ చేస్తే బెటర్ అని తమిళ, మలయాళ పరిశ్రమల వైపు వెళ్లింది. కోలీవుడ్ లో జయం రవితో ఒక సినిమా చేస్తున్న కృతి శెట్టి మలయాళ స్టార్ హీరో టోవినో థామస్ తో ఒక సినిమా చేస్తుంది. ఈ రెండు హిట్ పడితే అక్కడ కృతి తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ ఉంది.

## తమన్నా ఫేట్ అతడి చేతిలో..!

చాలా మంది నటవారసులను తెరకు పరిచయం చేస్తూ వారి ఫేట్ ని డిసైడ్ చేస్తున్నాడు కరణ్ జోహార్. ఇప్పటివరకూ కరణ్ పరిచయం చేసిన డెబ్యూ నటీమణులు ఎవరూ ఫెయిల్ కాలేదు. కెరీర్ పరంగా అత్యున్నత స్థానంలో ఉన్న కనీసం పది పేర్లు సినీప్రియులు చెప్పగలరు. సీనియర్ కథానాయికల కెరీర్ లకు కూడా అతడు బిగ్ బూస్టర్ అని చెప్పాలి. ఇంతకుముందే లస్ట్ స్టోరీస్ 2 సిరీస్ లో తమన్నాకు ఆఫర్ ఇచ్చాడు కరణ్. ఆ సిరీస్ లో తమన్నా పెర్ఫామెన్స్, బెడ్ రూమ్ సన్నివేశాలు బ్లాస్ట్ అయ్యాయి. అది నిజానికి తమన్నాకు ఓటీటీ కెరీర్ లో గొప్ప మైలేజ్ ని ఇచ్చింది. ఆ తర్వాత మళ్లీ అదే తరహాలో ప్రయత్నించి తమన్నా కెరీర్ బండిని సజావుగా సాగిస్తోంది. ప్రస్తుతం షోల పరంగా క్షణం తీరిక లేకుండా బిజీ అయింది. ఇప్పుడు లస్ట్ స్టోరీస్ 2 కి భిన్నమైన కంటెంట్ తో తమన్నాకు కరణ్ అద్భుత అవకాశాన్ని అందిస్తున్నాడు. కరణ్ జోహార్ కొత్త OTT సిరీస్ కోసం తమన్నా భాటియాతో కలిసి తన డిజిటల్ కంటెంట్



వెంచర్‌లను విస్తరిస్తున్నాడు. స్టార్టప్ ప్రపంచంలో ప్రవేశించి సత్తా చాటాలనుకున్న ఇద్దరు మహిళల గురించి నాటకీయంగా సాగే కథతో ఒక వెబ్ సిరీస్ ని కరణ్ నిర్మిస్తున్నారు.

ఈ సిరీస్ కి డా. అరోరాకి పేరుగాంచిన అర్చిత్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో చిత్రీకరణకు వెళు తుంది. ప్రస్తుతం రెండవ ప్రధాన పాత్రధారిని ఎంపిక చేయాల్సి ఉ ంది. కాఫీ విత్ కరణ్ తో కరణ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. కరణ్ జోహార్ తన చాట్ షో 8వ సీజన్‌ను అందించాడు. అలాగే కరణ్ నిర్మిస్తున్న అనన్య పాండే తొలి OTT షో 'కాల్ మీ బే' చిత్రీకరణకు వెళ్లనుంది. ఇమ్రాన్ హష్మీ తో 'షోటైమ్'ని ప్లాన్ చేసాడు. ఇంతలోనే అతడు మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా భాటియాతో ముందుకు సాగుతున్నాడు. తమన్నా భాటియా గత కొన్ని సంవత్సరాలుగా %బు% లో అద్భుతంగా రాణిస్తోంది. ఇప్పటికే లస్ట్ స్టోరీస్ 2, జీ లే జరా, ఆఖ్రీ సచ్ వంటి ఓటీటీ ప్రాజెక్ట్‌లను చేసింది.




## ఆదిలాబాద్ జిల్లాలో నేడు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

ఆదిలాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా పర్యటించనున్నారు. ముందుగా కేస్లాపూర్‌లో నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. తర్వాత ఇంద్రవెల్లిలో అమరవీరుల స్మృతి వనానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఇంద్రవెల్లిలో భారీ బహిరంగలో పాల్గొని ప్రసంగిస్తారు. ఇక్కడి నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని సీఎం రేవంత్ రెడ్డి పూరించనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరు కానున్నారు.

## అందుకే ఇంద్రవెల్లిలోనే రేవంత్ మొదటి సభ..



మంచిర్యాల, ఫిబ్రవరి 1: ఇంద్రవెల్లి దళిత గిరిజన దండోరా సభ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు నాంది పలికిందని.. అందుకే సీఎం హోదాలో రేవంత్ రెడ్డి మొదటి సభ కూడా మళ్ళీ అక్కడే నిర్వహిస్తున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమర వీరుల స్మృతి వనానికి సీఎం భూమి పూజ చేస్తారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇక్కడి అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. లక్ష మందితో ఇంద్రవెల్లి సభ జరుగుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**అదే సెంటిమెంట్‌తో ఇక్కడ కూడా...** కాగా.. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ పలు కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది.

ఇంద్రవెల్లి నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అప్పట్లో రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యాక 2021 ఆగస్టు 9న ఇంద్రవెల్లిలో దళిత గిరిజన దండోరా సభను నిర్వహించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే సెంటిమెంట్‌తో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ఇంద్రవెల్లి నుంచే ప్రారంభించాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఇంద్రవెల్లి బహిరంగ సభను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ పిలుపునిచ్చారు. మరోవైపు ఇంద్రవెల్లి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

## అసెంబ్లీ వద్ద సందడి.. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేశారు.

ఇక, కేసీఆర్‌తో స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రమాణం చేయించారు. ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. అంతకుముందు, కేసీఆర్ అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు.

ఈ క్రమంలో కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీకి కేసీఆర్ వస్తున్నారన్న వార్త నేపథ్యంలో బీఆర్ఎస్, కేసీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో, అసెంబ్లీ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

## అత్యధిక స్థానాలపై కమలం గురి

### రాష్ట్ర నాయకత్వంతో బీజేపీ అధిష్ఠానం సమాలోచనలు : అమిత్‌షాతో కిషన్‌రెడ్డి భేటీ

### అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలాబలాలపై చర్చ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 స్థానాల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా దక్షిణాదిలో పట్టు సాధించాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది ఈ మేరకు హస్తిన వేదికగా రాష్ట్ర నాయకత్వంతో సమాలోచనలు జరుపుతోంది. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన వారు, ప్రజాదరణ ఉన్న నేతలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు సామాజిక సమతుల్యాన్ని పాటిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసేలా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, సీనియర్ నేత ఈటల రాజేందర్‌లు బుధవారం ఢిల్లీలో జాతీయ నాయకత్వంతో భేటీ అయ్యారు. మరోవైపు కిషన్‌రెడ్డి పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమై దాదాపు 40 నిమిషాలు చర్చించారు. కాగా ఆయా సమావేశాల్లో 17 లోక్‌సభ స్థానాల్లో పార్టీ బలాబలాలు, తాజా రాజకీయ పరిస్థితి, బలమైన నేతలు, ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్టు సమాచారం.

**నడ్డా దిశా నిర్దేశం** : మంగళవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో జరిగిన సమావేశంలోనూ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన ప్రణాళికలపై అధ్యక్షుడు జేపీ నడ్డా దిశా నిర్దేశం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పార్టీ బలంగా ఉన్నందున, దక్షిణాదిలోనూ ముఖ్యంగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలిచేందుకు సిద్ధం చేసిన రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలతో పాటు పలువురు కేంద్ర మంత్రుల ప్రచార సభలు, రోడ్ షోలు తదితర ప్రచార కార్యక్రమాల షెడ్యూల్‌పై పార్టీ ప్రధాన కార్యదర్శులు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్ కుమార్‌లు జేపీ నడ్డాతో ప్రత్యేకంగా చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం లోక్‌సభ ఎ న్నికలపై ఏ విధంగా పడుతుందన్న అంశం వీరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. మరోవైపు కేవ లం సీనియర్లు అనే కాకుండా యువత, మహిళలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులను సైతం సీట్ల కేటాయింపులో పరిగణనలోకి తీసుకోవాలన్న యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం.

## త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తా: భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని కలలో కూడా ఊహించలేదని మేడ్చల్ భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆ షాక్ నుంచి తానింకా తేరుకోలేదన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తానని చెప్పారు. అభివృద్ధి కోసం సీఎంను కలిస్తే తప్పేంటని ప్రశ్నించిన ఆయన... గతంలో ఇద్దరం తెదేపాలో కలసి పని చేశామని గుర్తు చేశారు. రాజకీయ చర్చకు తావు లేకుండా సీఎంను కలిసే ముందు మీడియాకు సమాచారం ఇస్తానని తెలిపారు. "మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేయాలని మా పార్టీ నేతలు అడిగారు. నా కుమారుడికి ఎంపీ టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరా" అని మల్లారెడ్డి చెప్పారు.






ఢిల్లీ: మధ్య తరగతికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. అర్హులైన వారికి ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం హౌసింగ్ స్కీమ్ తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బస్తీలు, అద్దె ఇళ్లలో ఉండేవారి సొంతింటి కలను నిజం చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అలాగే, పీఎం ఆవాస్ యోజన కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సొంతింటి నిర్మాణం కోసం తీసుకొచ్చిన 'పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్' కరోనా కాలంలోనూ కొనసాగిందని నిర్మలా సీతారామన్ చెప్పారు.

3 కోట్ల ఇళ్ల నిర్మాణం లక్ష్యాన్ని త్వరలో చేరుకోనున్నామని చెప్పారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఐదేళ్లు ఈ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మొత్తం 2 కోట్ల ఇళ్లను నిర్మించనున్నట్లు వివరించారు.

**కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ :** విద్యుత్ బిల్లుల నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో నూతన పథకాన్ని ఆర్థికమంత్రి ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు సరికొత్త రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీమ్‌ను తీసుకురానున్నట్లు తెలిపారు. దీనివల్ల గృహ వినియోగదారులకు ఏటా రూ. 15వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఈ పథకం గురించి అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే.




### వ్యవ'సాయం' రూ.1.27 లక్షల కోట్లు.. నానో డీఏపీ విస్తరణ.. సమీకృత ఆక్వా పార్క్‌లు

ఢిల్లీ: రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, వ్యవసాయ రంగంలో విలువ జోడింపునకు మరింత కృషి చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ (%ఖఅఆశీఅ దీబంస్త్రవ్% 2024) ప్రసంగంలో ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన ద్వారా 38 లక్షల మంది అన్నదాతలకు ప్రయోజనం చేకూరిందని, 10 లక్షల మందికి ఉపాధి లభించిందన్నారు. 'మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ యోజన' ద్వారా 2.4 లక్షల స్వయం సహాయక బృందాలు, వ్యక్తిగతంగా మరో 60 వేల మందికి రుణసాయం అందించినట్లు చెప్పారు. పంట కోత అనంతరం నష్టాల నివారణ, దిగుబడి, ఆదాయం పెంపు కోసం వివిధ చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొత్తం మీద వ్యవసాయం, రైతుల సంక్షేమశాఖకు రూ.1.27 లక్షల కోట్లుబీ మత్స్య, పశుపోషణ, పాడి మంత్రిత్వ శాఖకు రూ.7,105 కోట్లు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖకు రూ.3,290 కోట్లు కేటాయించారు.

**నానో డీఏపీ విస్తరణ :** వ్యవసాయ రంగంలో మరింత వృద్ధి కోసం పబ్లిక్, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్లు సీతారామన్ తెలిపారు. సేకరణ, ఆధునిక నిల్వ వసతులు, సమర్థ సరఫరా వ్యవస్థ, ప్రాథమిక - సెకండరీ ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ వంటి వాటిలో పబ్లిక్ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తామన్నారు. నానో యూరియా విధానం విజయవంతమైన నేపథ్యంలో నానో డీఏపీని అన్ని అగ్రో - క్లైమేటిక్ జోన్లకు విస్తరిస్తామన్నారు. సాధారణంగా బస్తాల్లో డీఏపీ గుళికల రూపంలో ఉంటుంది. అదే నానో డీఏపీతో ద్రవ రూపంలో అందుబాటులోకి తెచ్చారు. ఎకరానికి అర లీటర్ నా నో డీఏపీ సరిపోతుందని శాస్త్రవేత్తల అంచనా. రైతులు ఎకరానికి రెండు బస్తాల డీఏపీ వినియోగిస్తుండగా.. సగటున రూ.3 వేలు ఖర్చవుతుంది. నానో డీఏపీ అర లీటర్ సీసా ధర రూ.600 ఉంటుందని అంచనా.

**నూనె గింజల్లో స్వయం సమృద్ధి..** 2022లో ప్రకటించిన 'ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్స్ అభియాన్'లో భాగంగా ఆవ, వేరుశెనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనె గింజల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. అందులో భాగంగా అధిక దిగుబడుల విత్తన రకాలపై పరిశోధన, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతుల అమలు, మార్కెట్ల అనుసంధానం, ధాన్యం సేకరణ, విలువ జోడింపు, పంటల బీమా వంటి అంశాలపై దృష్టి సారిస్తామని వెల్లడించారు.

**పాడి రైతులను ఆదుకుంటాం :** పాడి రైతులను ఆదుకునేందుకు సమగ్ర కార్యాచరణను రూపొందిస్తామని సీతారామన్ ప్రకటించారు. గాలికుంటు వ్యాధి నియంత్రణకు ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉందని గుర్తు చేశారు. కానీ, పశువుల పాల దిగుబడి తక్కువగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్న రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, డెయిరీ ప్రాసెసింగ్ - పశు పోషణ కోసం 'మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు' వంటి పథకాల ఆధారంగా కొత్త ప్రోగ్రాంను రూపొందిస్తామన్నారు.

**5 సమీకృత ఆక్వాపార్క్‌లు :** మత్స్యకారుల ప్రాముఖ్యతను గుర్తించి తమ ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దీని ఫలితంగా ఆక్వాకల్చర్ ఉత్పత్తి రెండింతలు పెరిగిందన్నారు. 2013-14 నుంచి మత్స్య సంపద ఎగుమతులు రెట్టింపయ్యాయని వెల్లడించారు. 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' అమలును మరికొన్ని లక్ష్యాల సాధనకూ విస్తరిస్తామన్నారు. అందులో భాగంగా ఆక్వాకల్చర్ ఉత్పాదకతను ప్రస్తుతం ఉన్న హెక్టారుకు మూడు టన్నుల నుంచి ఐదు టన్నులకు పెంచుతామన్నారు. ఎగుమతులను రెట్టింపు చేసి రూ.లక్ష కోట్లకు చేర్చుతామని తెలిపారు. సమీప భవిష్యత్తులో ఈ రంగంలో 55 లక్షల ఉపాధి అవకాశాలను సృష్టిస్తామన్నారు. ఐదు సమీకృత ఆక్వాపార్క్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పీఎం కిసాన్ ఆర్థిక సాయాన్ని ఎన్నికల ముందు ఏటా రూ.6 వేల నుంచి రూ.9 వేలకు పెంచుతారని అంచనా వేశారు. కానీ, ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవటం గమనార్హం. అలాగే పంట రుణాల మంజూరు లక్ష్యాన్ని పెంచుతారని ఆశించినా, బడ్జెట్‌లో అలాంటి చర్యలేవీ లేవు.

## ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణలో నేటితో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగునుంది. ఈ మేరకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. సర్పంచ్‌ల పదవీకాలంలో ముగిసిన నేపథ్యంలో మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. కేటీఆర్ ట్విట్టర్ వేదికగా..'సర్పంచ్ పదవికి మాత్రమే విరమణ. ప్రజాసేవకు కాదు ఐదేళ్ల కాలం తెలంగాణ ప్రజానీకానికి ఇతోధికంగ సేవచేసిన గ్రామ సర్పంచ్లు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా వారికి కృతజ్ఞతాభివందనాలు. కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ గ్రామాల్లో నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు నెలకొల్పడంలో, దేశానికి ఆదర్శంగా నిలిపిన కృషిలో మీ పాత్ర ఎనలేనిది. మీరు మరింతకాలం ప్రజాసేవలో ఉండాలని ఆశిస్తున్నాను' అంటూ కామెంట్స్ చేశారు.




## పెట్రోల్ బాటిళ్లతో విద్యార్థుల నిరసన.. కేయూలో ఉద్రిక్తత

వరంగల్, ఫిబ్రవరి 1: జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీలో మరోసారి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం ఉదయం వీసీ చాంబర్‌లో బీఈడీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. పెట్రోల్ బాటిల్స్ చేతబట్టి విద్యార్థులు నిరసన చేపట్టారు. విద్యాసంవత్సరం పూర్తి అయినప్పటికీ టీసీలు ఇవ్వడం లేదంటూ స్టూడెంట్స్ ఆరోపిస్తున్నారు. టీసీ ఇవ్వకపోవడంతో పీజీ అడ్మిషన్స్‌కు దరఖాస్తు చేసుకోలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు వారిస్తున్నారు. యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనతో క్షణం క్షణం ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

**ఇటీవల కాలంలో కాకతీయ వర్సిటీలో...** కాగా.. కాకతీయ యూనివర్సిటీలో ఏదో ఒక అంశానికి సంబంధించి నిత్యం ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గతేడాది యూనివర్సిటీలోని వివిధ విభాగాలలోని పీహెచ్‌డీ కేటగిరి - 2 అడ్మిషన్‌లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. వీసీ ఛాంబర్‌లోకి దూసుకెళ్లేందుకు విద్యార్థుల యత్నించడం ఉద్రిక్తతకు దారి తీసింది. వీసీ రమేష్ , రిజిస్ట్రార్ శ్రీనివాసరావుతో విద్యార్థులు వాగ్వాదానికి దిగారు. 75 శాతం అడ్మిషన్లను వీసీ, రిజిస్ట్రార్, ఆల్ డీన్స్ అమ్ముకున్నారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగి.. పర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అలాగే ఈ ఏడాది జనవరిలో వర్సిటీలో ఓ ఉద్యోగి మృతితోనూ గందరగోళ పరిస్థితి నెలకొంది. కేయూ ఉద్యోగి మధుసూదన్ గుండెపోటుతో మృతి చెందగా.. యూనివర్సిటీ అధికారులు వేధించడం వల్లే అతడు చనిపోయాడని బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. కేయూలో కాంట్రాక్టు వర్క్ కూడా చేస్తున్న మధుసూదన్‌కు యూనివర్శిటీ నుంచి రూ.13 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు చెల్లించకుండా అధికారులు వేధించారంటూ బంధువులు ఆరోపిస్తూ నిరసనకు దిగారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com